శనివారం
09-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 18
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం
స్థాపితం 1952 విశాలాంధ్ర 70

### వ్యవస్థలు కత్తి కట్టినా...
# గుండె చెదరలేదు

- మంచిని ఓర్వలేని దుష్టచతుష్టయం
- టీడీపీ ఎన్నికల ప్రణాళిక మాయం
- వైసీపీ ప్లీనరీకి భారీగా కార్లతో పార్టీ శ్రేణుల రాక
- గుంటూరు-విజయవాడ రహదారిపై రద్దీ
- పార్టీ అధినేత జగన్ ప్రారంభోపన్యాసం
- వైఎస్ విజయమ్మ కీలక ప్రసంగం
- తొలిరోజు మంత్రులు ధర్మాన, బొత్స, రోజా, ఆదిమూలపు సురేశ్ ప్రసంగం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** జగమంత కుటుంబం ఏనాడూ నా చేయి వీడలేదు... పార్టీ ప్రయాణంలో ఎన్ని ముళ్లున్నా, రాళ్లు పడినా, ఎన్ని వ్యవస్థలు మనపై కత్తి కట్టినా, దుష్ప్రచారాలు చేసినా ఆ కట్టు కథకు విలువలేదు... నా గుండె చెదరలేదు, నా సంకల్పం ఆగలేదు...' అని వైసీపీ అధినేత, సీఎం జగన్ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) ప్లీనరీలో సీఎం జగన్ ప్రారంభోపన్యాసం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి జగన్, వైఎస్ విజయమ్మ పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ ప్లీనరీకి తొలిరోజు 26 జిల్లాల నుంచి లక్షలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. తొలుత జగన్, వైఎస్ విజయమ్మ వేదికపైకి వచ్చి పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. మళ్లీ మళ్లీ రావాలి జగన్ అంటూ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నినదించారు. వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సమావేశానికి అధ్యక్షత వహించారు. వైసీపీ అధినేత జగన్ ప్రసంగిస్తూ, అధికారమంటే అహంకారం కాదని, ప్రజలపై మమకారమంటూ నిరూపించామని అన్నారు. 2009, సెప్టెంబర్ 25న పావురాలగుట్టలో సంఘర్షణ మొదలైంది. ఓదార్పు యాత్రతో పార్టీ ఒక రూపం దాల్చిందని, వైఎస్సార్ ఆశయాల సాధన కోసం పార్టీ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. నన్ను ప్రేమించి, నాతో వెన్నుదన్నుగా నిలబడిన కోట్లాది మంది అభిమానులకు, ప్రజలకు నమస్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ 13 ఏళ్ల ప్రయాణంలో చాలా సవాళ్లు ఎదుర్కొన్నామని, నాన్న (వైఎస్సార్) నాకు ఇచ్చిన ఈ

- మిగతా 2 లో

# అమ్మ రాజీనామా

- పార్టీ శ్రేణుల నిరుత్సాహం
- షర్మిలకు అండగా నిలుస్తా
- తల్లిగా జగన్‌కు ఎప్పుడూ మద్దతు
- విజయమ్మ భావోద్వేగం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** వైసీపీ గౌరవాధ్యక్షురాలు పదవికి వైఎస్ విజయమ్మ రాజీనామా చేశారు. శుక్రవారం జరిగిన వైసీపీ తొలిరోజు ప్లీనరీ వేదికగా ఆమె ఈ ప్రకటన చేశారు. దీంతో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా నిరుత్సాహానికి గురయ్యారు. విజయమ్మ ఆ ప్రకటన చేసిన సమయంలో రాజీనామా వొద్దు..వొద్దు అంటూ నినదించారు. ఇక నుంచి తాను తెలంగాణలో షర్మిలకు అండగా నిలుస్తానని విజయమ్మ వెల్లడించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రస్థానమంతా జనంతో ముడిపడి ఉందని విజయమ్మ అన్నారు. వైసీపీ ప్లీనరీ సమావేశాలకు హాజరైన విజయమ్మ మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి అందరివాడనీ, అందరి హృదయాల్లో ఆయన సజీవంగా ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్, తెలంగాణలో షర్మిల వేర్వేరుగా పార్టీలు పెట్టారని, ఇది ఊహించని విషయమేనన్నారు. తల్లిగా షర్మిలకు రాజకీయంగా వెన్నుదన్నుగా ఉండాలనే లక్ష్యంతో తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల మధ్య రాజకీయ విమర్శలకు ఎలాంటి తావులేకుండా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పునరుద్ఘాటించారు. నాడు అధికార శక్తులన్నీ విరుచుకుపడినప్పటికీ జగన్ బెదరలేదన్నారు. అన్యాయంగా కేసులు పెట్టి వేధించారనీ, 2011లో కాంగ్రెస్ పొమ్మనలేక పొగపెట్టిందని మండిపడ్డారు. జగన్ ఓర్పు, సహనంతో ఎంతో ఎత్తుకు ఎదిగారని కొనియాడారు. ఉద్దండ నాయకులకే జగన్ గొంతు ఎండిపోయేలా చేశారన్నారు. ఇవాళ సగర్వంగా ప్లీనరీ నిర్వహించుకుంటున్నామని, ప్రజలందర్నీ ఆశీర్వదించడానికి, అభినందించడానికి తాను వచ్చానన్నారు. ప్రజాభిమానం, ఇచ్చిన మాట నుంచి వైసీపీ

- మిగతా 2 లో

### జపాన్ మాజీ ప్రధాని షింజో అబే
# దారుణహత్య

- ఎన్నికల సభలో ప్రసంగిస్తుండగా కాల్పులు-సాయుధుడి అరెస్టు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- ప్రధాని కిషిడా దిగ్భ్రాంతి-భద్రతా ఏర్పాట్లపై దర్యాప్తునకు ఆదేశం
- నేడు సంతాప దినం ప్రకటించిన భారత్

**టోక్యో:** జపాన్ మాజీ ప్రధానమంత్రి షింజో అబే శుక్రవారం దారుణహత్యకు గురయ్యారు. పశ్చిమ జపాన్‌లోని నరా పట్టణంలో ఎన్నికల సభలో ప్రసంగిస్తున్నప్పుడు ఆయనపై కాల్పులు జరిగాయి. సాయుధ దుండగుడు రెండుసార్లు కాల్పులు జరుపగా బులెట్లు అబే ఛాతీలోకి దూసుకెళ్లాయి. ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. తీవ్ర రక్తస్రావం అవుతుంటే హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అబే పరిస్థితి విషమించింది. కీలక అవయవాలు పని చేయడం ఆగిపోయింది. గుండె స్పందన లేదు. షింజో అబేను కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. షింజో అబే గుండె బాగా దెబ్బతిన్నదని, మెడ వద్ద రెండు గాయాలతో ధమని దెబ్బతిని తీవ్ర రక్తస్రావం అయి గుండెపోటు స్థితిలో ఆసుపత్రికి తీసుకొచ్చారని, ఎంత ప్రయత్నించినా ప్రాణాలు కాపాడలేకపోయామని నరా వైద్య విశ్వవిద్యాలయం అత్యవసర విభాగాధిపతి హిడేటడా ఫుకుషిమా తెలిపారు. దేశంలో అత్యంత శక్తిమంత నాయకుల్లో ఒకరైన అబే మరణ వార్త జపాన్ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటనాస్థలిలోనే సాయుధుడిని

- మిగతా 2 లో

# అమర్‌నాథ్‌లో జలవిలయం
## 10 మంది మృతి, 40 మంది గల్లంతు

2 లో

# విస్తారంగా వర్షాలు

- ఏపీ, తెలంగాణల్లో వచ్చే ఐదు రోజుల్లో భారీగా పడే అవకాశం
- చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలు

2 లో

చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలకు ఆవర్తనాలు తోడవడంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) దేశంలోని పలు రాష్ట్రాలకు వర్ష సూచన చేసింది. రాగల ఐదు రోజుల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

### గిరిజనానికి తప్పని
# డోలీ మోత

**విశాలాంధ్ర- కురుపాం/జియ్యమ్మవలస:** ఎన్నాళ్లైనా...ఎన్నేళ్లైనా ఆదివాసీ ఆడబిడ్డల ప్రసవ వేదన అరణ్య రోదనగా మిగిలి పోతోంది. సాక్షాత్తు గిరిజన ఎమ్మెల్యేలు మంత్రులుగా బాధ్యతలు ఉన్నప్పటికీ అడవి బిడ్డల బతుకులు మారడం లేదు. అత్యవసర సమయంలో ఆకాశంలోకి బిత్తర చూపులు చూడటం తప్ప చేయగలిగిందేమీ కనిపించడం లేదు. ఎవరో వస్తారని... ఏదో చేస్తారని వేచిచూడకుండా తమ ప్రాణాలు తామే కాపాడు కోవాల్సిందేనంటూ ఆవేదన చెందుతున్నారు. ఆసుపత్రులకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేదు..ఓ గర్భిణీని ప్రసవం కోసం డోలీలో ఆసుపత్రికి మోసుకెళ్లిన ఘటన తాజాగా విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలం చినతోలుమండ గ్రామంలో చోటుచేసుకుంది. కొండగొర్రి కాసులమ్మ అనే

- మిగతా 2 లో

## ఆల్ట్ న్యూస్ జుబేర్‌కి తాత్కాలిక బెయిల్

2 లో

## ఇదీ లోకం!

నచ్చారా సార్! అయితే ఈయనకు కూడా ఇచ్చేద్దామా!?

# 19 నుంచి అసెంబ్లీ

- 18న రాష్ట్రపతి ఎన్నికకు పోలింగ్
- ఐదురోజులు జరపాలని నిర్ణయం




**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 19 నుంచి వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 18న రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఏపీ అసెంబ్లీలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రం నుంచి ఎలక్టోరల్ కాలేజ్‌లో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తర్వాత రోజు నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులు సమావేశాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 19న బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. అందులో సభను ఎప్పటి వరకు నిర్వహించేది స్పష్టత వస్తుంది. సభా నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌పై కూడా బీఏసీలోనే ఖరారు కానుంది. అదే రోజున శాసనసభ డిప్యూటీ స్పీకర్ ఎంపిక కోసం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కొత్త డిప్యూటీ స్పీకర్‌గా ఇప్పటికే విజయనగరం ఎమ్మెల్యే కోలగొట్ల వీరభద్ర స్వామికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ ప్రక్షాళనలో భాగంగా వైశ్య వర్గానికి చెందిన వెల్లంపల్లి శ్రీనివాసరావు పదవీచ్యుతులయ్యారు. ఆ స్థానాన్ని కోలగొట్ల వీరభద్రస్వామితో భర్తీ చేయాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఇప్పటి వరకు డిప్యూటీ

- మిగతా 2 లో

### వంట నూనె ధర
# రూ.15 తగ్గింపు?

## మరిన్ని కంపెనీలు ధరలు తగ్గిస్తాయి : కేంద్రం

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ సరుకు ధరల తగ్గుదల ప్రయోజనాలను వినియోగదారులకు అందించడానికి మరిన్ని కంపెనీలు వంట నూనెల గరిష్ఠ రిటైల్ ధరలను లీటరుకి రూ.15 వరకు తగ్గించాలని భావిస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. దేశీయ విపణిలో వంట నూనెల ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో ధరలను తగ్గించాలని ప్రభుత్వం బుధవారం ఆహార నూనెల కంపెనీలను ఆదేశించింది. ఈ ఆదేశాలను అనుసరించి, మదర్ డెయిరీ గురువారం సోయాబీన్, రైస్ బ్రాన్ ఆయిల్ ధరలను లీటరుకు రూ.14 వరకు తగ్గించింది. రాబోయే 15 నుంచి 20 రోజుల్లో సన్‌ఫ్లవర్ ఆయిల్ ఎంఆర్‌పీ తగ్గుతుందని అంచనా వేస్తోంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ప్రముఖ పాల సరఫరాదారుల్లో ఒకటైన మదర్ డెయిరీ, ధారా బ్రాండ్‌తో వంట నూనెలను విక్రయిస్తోంది. భారతదేశం తన ఆహార నూనెల అవసరాలలో 60 శాతం దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. కాగా 'తమ ధరలను తగ్గించని, ఇతర బ్రాండ్‌ల కంటే ఎంఆర్‌పీ (గరిష్ఠ రిటైల్ ధర) ఎక్కువగా ఉన్న కొన్ని కంపెనీలకు కూడా వాటి ధరలను

- మిగతా 2 లో

# ఠాణాల్లో సీసీ కెమెరాలేవి?

- మూడింట ఒక్కస్టేషన్‌లోనూ కనిపించని వైనం
- పోలీసు బలగాల్లో అతివలకు దక్కని చోటు
- భారత న్యాయ నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఆచరణలో అది సాధ్యం కావడం లేదు. ఇప్పటికీ ప్రతి మూడింట ఒక పోలీస్ స్టేషన్‌లో ఒక్క సీసీ కెమెరా కూడా లేదని తాజాగా ఓ నివేదికలో వెల్లడైంది. మరోవైపు గడిచిన దశాబ్దకాలంలో దేశంలో పోలీస్ బలగాల సంఖ్య 32 శాతం పెరిగినప్పటికీ..ఇందులో మహిళల వాటా కేవలం 10 శాతం మాత్రమేనని పేర్కొంది. 'పోలీస్: ఇంప్రూవ్‌మెంట్స్, షార్ట్‌ఫాల్స్ అండ్ నేషనల్ ట్రెండ్స్-ఎన్ ఎనాలసిస్ ఆఫ్ డేటా ఆన్ పోలీస్ ఆర్గనైజేషన్ 2021' పేరిట తాజాగా విడుదల చేసిన భారత న్యాయ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా మొత్తం 17,233 పోలీస్ స్టేషన్లు ఉండగా, వాటిలో 5396 స్టేషన్లలో ఒక్క సీసీ కెమెరా కూడా లేదు. తెలంగాణ, ఒడిశా, పుదుచ్చేరిలలో మాత్రమే పోలీసు స్టేషన్‌లలో ఒక్క సీసీ కెమెరా అయినా ఉన్నది. రాజస్థాన్‌లో 894 స్టేషన్లు ఉండగా కేవలం ఒక్క స్టేషన్లోనే నిఘా నేత్రాలు ఉండగా..మణిపూర్, లద్దాక్, లక్షద్వీప్‌లోని స్టేషన్లలో కనీసం ఒక్క సీసీ కెమెరా కూడా లేదు. భారత్‌లో 41శాతం పోలీస్ స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్క్‌లు లేవు. పోలీస్ బలగాల్లో కేవలం 10.5 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. 2006లో 3.3 శాతంగా ఉన్న మహిళా పోలీసుల భాగస్వామ్యం 10.5 శాతానికి చేరడానికి 15ఏళ్లు (2020 నాటికి) పట్టింది. ఏ రాష్ట్రంలోనూ నిర్దేశించుకున్న 33 శాతం స్థాయిలో మహిళలు పోలీస్ బలగాల్లో లేరు. ఒడిశా పోలీస్ బలగాల్లో 33 శాతం మహిళలు ఉండాలంటే మరో 428 ఏళ్లు..మిజోరం

రాష్ట్రానికి ఏకంగా 585 ఏళ్లు పడుతుందని నివేదిక అంచనా వేసింది. అదే గుజరాత్‌కు ఏడేళ్లు, బీహార్‌కు ఎనిమిదేళ్లు అవసరమని తెలిపింది. ప్రస్తుత గణాంకాల ప్రకారం..దేశవ్యాప్తంగా పోలీసు బలగాల్లో 33 శాతం మహిళలు ఉండాలంటే..మరో 33 ఏళ్లు పడుతుంది. గతేడాది జనవరి నాటికి దేశవ్యాప్తంగా 5.62 లక్షల పోలీస్ ఉద్యోగాల ఖాళీలు ఉండగా.. అత్యధికంగా బీహార్‌లో 41.8 శాతం ఖాళీలున్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలు.. కానిస్టేబుల్, పోలీసు అధికారి పోస్టుల్లో 1/4 వంతు కంటే ఎక్కువ ఖాళీలతో పనిచేస్తున్నాయి.

# షింజోపై దాడి అత్యంత హేయం

**టోక్యో:** జపాన్ మాజీ ప్రధాని షింజో అబేపై దాడి ఘటన హేయమైందని, ఏమాత్రం సహించబోమని జపాన్ ప్రధాని ఫిమియో కిషిడా విచారం వ్యక్తం చేశారు. ఎన్నికలు జరగబోయే వేళ ఈ దాడి జరిగిందని,ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా పేర్కొన్నారు. కాల్పుల ఘటనను ప్రధాని కిషిడా ఖండించారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న మంత్రులందరూ టోక్యో చేరుకోవాలని ఆదేశించారు.

**విచారం వ్యక్తం చేసిన నాటో చీఫ్**

జరిగిన దాడిపై నాటో చీఫ్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ శుక్రవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రధాని ఫ్యూమియో కిషిడా ఆధ్వర్యంలో జపాన్ ప్రభుత్వానికి నాటో రక్షణ కూటమి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. "ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న సందర్భంలో కాల్పులు జరపడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. నా ఆలోచనలు అతనితో, అతని కుటుంబంతో ప్రగాఢంగా ఉన్నాయని స్టోల్టెన్‌బర్గ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

**అమెరికా రాయబారి సంతాపం**

అబే కాల్చివేతపై జపాన్‌లోని అమెరికా రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ 'విషాదం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మాజీ ప్రధాని అబే షింజోపై కాల్పులు జరగడం పట్ల మేమంతా విచారం వ్యక్తం చేస్తున్నాం. అబే జపాన్‌కు అత్యుత్తమ నాయకుడు, అమెరికాకు చిరకాల మిత్రుడుగా రహమ్ కొనియాడారు. అబే క్షేమం కోసం అమెరికా ప్రభుత్వం, అమెరికన్ ప్రజలు ప్రార్థిస్తున్నారు. అని ఇమాన్యుయేల్ ఒక ప్రకటనలో తెలిపారు. యుఎస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్, బాలిలో జరుగుతున్న త్రైపాక్షిక సమావేశంలో జపాన్, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రులతో మాట్లాడుతూ, అబే హత్య తీవ్రంగా కలవరపరచే అంశంగా పేర్కొన్నారు. అబే ఒక అసాధారణ భాగస్వామిగా పేర్కొనా&్వరు. జపాన్ ప్రజలకు గొప్ప నాయకుడని కొనియాడారు. అబే హయాంలో అమెరికా-జపాన్ మధ్య సంబంధాలు ప్రగాఢమైనవిగా పేర్కొన్నారు.

**ఇరాన్,స్పెయిన్ దిగ్భ్రాంతి**

జపాన్ మాజీ ప్రధాని షింజో అబే శుక్రవారం హత్యకు గురికావడంపై ఇరాన్ దీనిని "ఉగ్రవాద చర్య"గా స్పెయిన్ "పిరికి దాడి"గా పేర్కొన్నాయి.

**బ్రిటీష్, ఉక్రెయిన్‌ల ప్రగాఢ సానుభూతి**

బ్రిటీష్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ కాల్పులు "నీచమైన చర్యలుగా పేర్కొన్నారు. ఉక్రెయిన్ ప్రెసిడెంట్ వోలోడిమిర్ జెలెన్స్కీ "ఈ క్లిష్ట సమయంలో అతని కుటుంబానికి, జపాన్ ప్రజలకు తన ప్రగాఢ సానుభూతిని" తెలియజేస్తూ ట్వీట్ చేశారు.

**న్యూజిలాండ్ సంతాపం**

కాల్పుల ఘటనపై న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆర్డెర్న్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత తాను కలిసిన తొలి నాయకులలో అబే ఒకడని, ఆయన తన పాత్రకు ఎంతో నిబద్ధతతో ఉన్నారని పేర్కొన్నారు.స్పెయిన్, ఫ్రాన్స్ సహా అనేక దేశాలు జపాన్‌కు సంఘీభావం తెలిపాయి. సంతాపం తెలిపిన వారిలో జర్మనీ, పాకిస్తాన్, స్వీడన్ మరియు ఫిలిప్పీన్స్ నాయకులు ఉన్నారు. ఆస్ట్రేలియాకు అత్యంత సన్నిహితులలో అబే ఒకరని "ప్రపంచ వేదికపై దిగ్గజం"గా పేర్కొన్నారు.అబే హత్య తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని జర్మనీ మాజీ వైస్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ పేర్కొన్నారు. ఇటలీ ప్రధాని డాఘి తన ప్రగాఢ సానుభూని తెలియచేశారు.

# ఉమ్మడి కార్యాచరణకు చైనా, రష్యాల మద్దతు

**బాలి :** చైనా, రష్యాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడానికి, దేశాల ఉమ్మడి ప్రయోజనాలను సంయుక్తంగా పరిరక్షించడానికి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్‌రోవ్ కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇండోనేషియాలోని బాలిలో గ్రూప్ ఆఫ్ 20 (జి 20) విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో చైనా, రష్యాలు ముందుకు సాగాయని వాంగ్ చెప్పారు. వివిధ రంగాలలో సహకారం లక్ష్యంగా ద్వైపాక్షిక సంబంధాలలో బలమైన వ్యూహాత్మక విధానాన్ని అమలుచేయాలని సంకల్పించారు. చైనా నిర్వహిస్తున్న 14వ బ్రిక్స్ సదస్సులో రష్యా పాల్గొనడాన్ని చైనా అభినందించింది. అంతర్జాతీయ సమాజంలో ఏకాభిప్రాయాన్ని పెంపొందించడంతోపాటు ప్రపంచ అభివృద్ధిని ప్రోత్సహించడంలో రష్యా సహకారాన్ని చైనా అభినందించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల ఉమ్మడి ప్రయోజనాలను కాపాడేందుకు, అంతర్జాతీయ సమానత్వం, న్యాయాన్ని కాపాడేందుకు, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యంగా 2030 అజెండాను వేగవంతం చేయడానికి రష్యా సహా ఇతర బ్రిక్స్ సభ్యులతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రష్యా, చైనా ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాన్ని పరిరక్షించడంలో, సరసమైన అంతర్జాతీయ క్రమాన్ని ప్రోత్సహించడం, బాధ్యతాయుతమైన వైఖరిని సమర్థించడం వ్యూహాత్మక సహకారాన్ని కొనసాగించడం ద్వారా అంతర్జాతీయ సంబంధాలలో ముఖ్య పాత్ర పోషించాయని లవ్‌రోవ్ చెప్పారు. రష్యా-చైనా సంబంధాలు విదేశ జోక్యానికి లోబడి ఉండవని, రెండు దేశాల మధ్య ఆచరణాత్మక సహకారం సజావుగా సాగుతుందని, అభివృద్ధికి గొప్ప అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆధిపత్యం, బెదిరింపు, ఏకపక్షవాదాన్ని వ్యతిరేకించడం అభివృద్ధి చెందుతున్న దేశాల ఉమ్మడి ఆకాంక్షగా వాంగ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ పరిస్థితిపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. లవ్‌రోవ్ రష్యా-ఉక్రెయిన్ పరిస్థితిని, ప్రస్తుత సమస్యలపై రష్యా వైఖరిని, ప్రతిపాదనను ప్రవేశపెట్టారు.

## ప్రపంచ శాంతికి అమెరికానే పెద్ద ముప్పు

**బాలి :** ప్రపంచ శాంతి, స్థిరత్వం,అభివృద్ధికి అమెరికా అతిపెద్ద ముప్పుగా ఉందని చైనా పేర్కొంది. ఇండోనేషియాలోని బాలిలో జరుగుతున్న జి20 దేశాల మంత్రుల శిఖరాగ్ర సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మధ్య చర్చల నేపథ్యంలో చైనా పై విధంగా వ్యాఖ్యానించింది. విదేశాల్లో అసమ్మతిని అణిచివేసేందుకు చైనా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలుగా చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి జావో లిజియాన్ వ్యాఖ్యలపై బ్రిటన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ నాయకుడు చైనా ప్రభుత్వం గురించి తాజా హెచ్చరికలను లేవనెత్తిన ఒక రోజు తర్వాత పై వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి అమెరికా అతిపెద్ద ముప్పు అని వాస్తవాలు పూర్తిగా రుజువు చేశాయని జావో పేర్కొన్నారు. చైనాలో పరిణామాలను నిష్పక్షపాతంగా, సహేతుకంగా చూడాలని, అసత్యాలను వ్యాప్తి చేయడం ఆపాలని బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయడం మానేయమని వాంగ్ అమెరికాను హెచ్చరించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆధ్వర్యంలో, అమెరికా దాని మిత్రదేశాల ప్రభావాన్ని అణగదొక్కాలని కోరుతూ రష్యాతో కలిసి చైనా విదేశాంగ విధానాన్ని చేపట్టింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఖండించడానికి చైనా అసమ్మతి వ్యక్తం చేసింది. రష్యాకు వ్యతిరేకంగా పాశ్చాత్య ఆంక్షలను ఖండిస్తూ అమెరికా, నాటో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న వివాదాల్ని మరింత రేకెత్తిస్తున్నాయని రెండు దేశాల నాయకులు పేర్కొన్నారు.

## గిరిజనానికి తప్పని డోలీ మోత

(మొదటిపేజీ తరువాయి)

గర్భిణీని డోలీతో మోసుకుంటూ రామభద్రపురం ఆసుపత్రికి తరలించారు. కొండ నుంచి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దిగాల్సిన పరిస్థితి. సకాలంలో ఆసుపత్రికి చేరటంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మార్గమధ్యంలో కాన్పు జరిగి తల్లీబిడ్డలు మృతి చెందిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి.

## అమ్మ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

పుట్టిందని, ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, జగనన్న అమ్మఒడి, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పాలనలో విప్లవాన్ని తెచ్చారని, జగన్ చెప్పినవే కాకుండా, చెప్పనివీ చాలా చేశారని వివరించారు. జగన్ మాస్ లీడర్ అని, యువతకు రోల్‌మోడల్ అని పేర్కొన్నారు. ప్రజలందరి ప్రేమ సంపాదించిన జగన్‌ను చూసి గర్వపడుతున్నానని చెప్పారు. నాడు తన బిడ్డ జగన్‌ను నడిపించుకోమని మీకే అప్పజెప్పగా, అందుకు నడిపించిన అందరిపైనా అణువణువునా కృతజ్ఞత ఉందన్నారు. ప్రజల బిడ్డల్నీ జగన్ చేతుల్లో పెట్టాలనీ, వారికి ఉజ్వల భవిష్యత్ అందిస్తారని స్పష్టంచేశారు. ప్రజలతో తన అనుబంధం ఈనాటిది కాదనీ, 45 ఏళ్ల అనుబంధముందని చెప్పారు. ఇకపైనా ఈ అనుబంధం కొనసాగాలంటూ విజయమ్మ భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్సార్ బిడ్డగా షర్మిల వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ పెట్టుకుందని, తండ్రి ఆశయాల మేరకు ప్రజాసేవ చేయాలనే నిర్ణయించుకుందని వివరించారు. ప్రస్తుతం ఆమెకు తన అవసరముందన్నారు. ఏపీ ప్రయోజనాల కోసం వైఎస్ జగన్ ఇక్కడ అవసరమని, తెలంగాణ కోడలిగా షర్మిల అక్కడ ప్రజాసేవలో ఉండాలనుకున్నారని విశ్లేషించారు. తెలంగాణలో ఏపీ కంటే ముందుగానే ఎన్నికలు వస్తున్నాయని చెప్పారు. వైఎస్సార్ బిడ్డలే అయినా ఇద్దరు వేర్వేరు పార్టీలకు ప్రతినిధులు. ప్రజల మద్దతుతో మళ్లీ సీఎంగా జగన్ గెలుస్తారని విజయమ్మ చెప్పారు. తల్లిగా జగన్‌కు తనమద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. తన ఉనికి ఎవరికీ వివాదాస్పదం కాకుండా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకుంటున్నానని స్పష్టం చేశారు. ప్రజలకు తన ఇద్దరు బిడ్డలు అండగా ఉంటారనీ, వారికి మీ మద్దతు కావాలని కోరారు. విజయమ్మ ప్రసంగం అనంతరం వేదికపై ఉన్న జగన్ ఆమెను దగ్గరకు తీసుకుని ఓదార్చారు.

## ఆల్ట్ న్యూస్ జుబేర్‌కి తాత్కాలిక బెయిల్

**న్యూఢిల్లీ:** మత విశ్వాసాలను రెచ్చగొట్టాడన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌లో దాఖలైన కేసులో ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌కి సుప్రీంకోర్టు శుక్రవారం ఐదు రోజుల మధ్యంతర బెయిల్‌ని మంజూరు చేసింది. ఢిల్లీ కోర్టు పరిధిని వీడి వెళ్లకూడదని, ఈ కేసుకు సంబంధించి ట్విట్టర్‌లో ఎటువంటి పోస్టులు పెట్టవద్దని జుబేర్‌కు షరతు విధించింది. న్యాయమూర్తులు ఇందిరా బెనర్జీ, జేకే మహేశ్వరిలతో కూడిన వెకేషన్ బెంచ్ జుబేర్ దాఖలు చేసిన పిటిషన్‌పై నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణ ఇతర ధర్మాసనంలో జరుగుతుందని తెలిపింది. సీతాపూర్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి తన మధ్యంతర బెయిల్ ఉత్తర్వులు ఉన్నాయని, ఢిల్లీలో అతనిపై నమోదైన కేసుకు ఎలాంటి సంబంధం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. సీతాపూర్‌లో నమోదైన కేసులో దర్యాప్తుపై స్టే లేదని, అవసరమైతే ల్యాప్‌టాప్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పోలీసులు స్వాధీనం చేసుకోవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా...ఢిల్లీ కోర్టు ఆదేశం ప్రకారం జుబేర్ కస్టడీలోనే ఉంటారని చెప్పారు. సీతాపూర్ కోర్టు గురువారం తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిందని, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను అటకెక్కించారని ఆయన అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అతను పోలీసు కస్టడీలోనే ఉన్నాడని వివరించారు. జూన్ 1న హిందూ శ్రీసేన సీతాపూర్ జిల్లా అధ్యక్షుడు భగవాన్ శరణ్ చేసిన ఫిర్యాదుపై ఉత్తరప్రదేశ్‌లో జుబేర్‌పై ఐపీసీ సెక్షన్ 295ఏ (మత భావాలను రెచ్చగొట్టేలా ఉద్దేశపూర్వకంగా, హానికరమైన చర్య), ఐటీ చట్టంలోని ఐపీసీ సెక్షన్ 67 కింద ఎఫ్ఐఆర్ నమోదయింది. జుబేర్ తన ట్వీట్లలో ఒకదాని ద్వారా మతపరమైన మనోభావాలను దెబ్బతీశారన్న ఆరోపణపై జూన్ 27న ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. జుబేర్ తరపు సీనియర్ న్యాయవాది కోలిన్ గోన్సాల్వేస్ మాట్లాడుతూ అతను తన ట్వీట్‌లను అంగీకరిస్తున్నాడని, అయితే ఈ ట్వీట్‌లు ఎటువంటి నేరాన్ని బహిర్గతం చేయలేదని, ద్వేషపూరిత ప్రసంగాల నేరాలను మాత్రమే ఎత్తి చూపారని, పోలీసులు నేరస్థులపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. జుబేర్ ప్రాణాలకు ముప్పు ఉందని, ఇది జీవించే హక్కుకు సంబంధించిన ప్రశ్న అయినందున అతనికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని గోన్సాల్వేస్ అన్నారు. తదుపరి విచారణ తేదీకి ముందు ఉత్తరప్రదేశ్ కోర్టు అనుమతించిన ఉత్తర్వును ఇతర పత్రాలతో సహా దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

## గుండె చెదరలేదు

(మొదటిపేజీ తరువాయి)

జగమంత కుటుంబం... నా చేయి ఎప్పుడూ వదల్లేదని చెప్పారు.

**కనీవినీ ఎరుగని ఆధిక్యత**

ప్రజలు మూడేళ్ల కిందట కనీవినీ ఎరుగని ఆధికత్యను ఇచ్చారని జగన్ అన్నారు. ఏకంగా 151 స్థానాల్లో విజయం సాధించిన మనకు ప్రజలు అధికారం కట్టబెట్టారని, ప్రతిపక్షాన్ని 23 ఎమ్మెల్యే సీట్లకు, 3 ఎంపీ సీట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ వైసీపీ అని గర్వంగా చెబుతున్నామన్నారు. ఈ మూడేళ్ల ప్రయాణం చాలా పోరాటాల ప్రస్థానం చేశారని, రైతులపై మమకారమంటే ఇలా ఉంటుందని నిరూపించిందన్నారు. మనపై ఎన్ని రాళ్లు పడ్డా, మనపై ఎన్ని నిందలేసినా ఎదుర్కొన్నామని చెప్పారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని దాడులు జరిగినా గుండె చెదరలేదని, సంకల్పం మారలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో దోచుకోవడం, పంచుకోవడం ఆగిపోయిందన్నారు. దీంతో గజదొంగల ముఠాకు నిద్రపట్టడం లేదని చెప్పారు. పదవి అంటే అధికారం కాదని, ప్రజల మీద మమకారమని నిరూపించామన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రతిక్షణం తపన పడ్డామని తెలిపారు. అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మేనిఫెస్టోలో హామీలు ఇచ్చి మాయం చేసే పార్టీలను చూశామనీ, ప్రజలు నిలదీస్తారేమోనని టీడీపీ ఎన్నికల ప్రణాళికను మాయం చేసిందని విమర్శించారు. ఆ పరిస్థితి నుంచి మేనిఫెస్టో అంటే అమలు చేసే ప్రతిజ్ఞగా చూపించామన్నారు. వైసీపీ మేనిఫెస్టోను ప్రజల ముందు పెట్టి 95 శాతం హామీలు అమలు చేశామనీ, వైసీపీ మేనిఫెస్టోను చూడటానికే టీడీపీ భయపడే పరిస్థితి వచ్చిందన్నారు.

**దోచుకోవడానికే గజదొంగల ముఠా**

దుష్టచతుష్టయం మన పాలనలో మంచిని ఓర్వలేక అబద్ధాల విష ప్రచారం చేస్తున్నారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 ఏళ్ల సీఎంగా చేసిన చంద్రబాబు ఇవాళ నోరు పారేసుకుంటున్నారన్నారు. ఆ కట్టుకథల్ని, వాటికి అబద్ధాలు జోడించి ఎల్లోమీడియా ప్రచారం చేస్తోందని, గతంలో రాష్ట్రాన్ని దోచుకో పంచుకో అన్నట్లుగా గజదొంగల ముఠా వ్యవహరించిందని విమర్శించారు. ఇప్పుడు అవకాశం లేక కడుపుమంటతో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

వైసీపీ ఎప్పుడూ జనం వెంట, జనం గుండెల్లో ఉందని ఆయన తెలిపారు. గజదొంగల ముఠా మాత్రం ఎల్లో మీడియా, ఎల్లో సోషల్ మీడియాలోనే ఉందన్నారు. వాళ్లకు, మనకు ఎక్కడా పోలిక లేదని, మనది చేతల పాలన, వాళ్లది అబద్ధపు విష ప్రచారమన్నారు. ఆ తర్వాత వైఎస్ విజయమ్మ కీలక ఉపన్యాసం చేస్తూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల ఆధారంగా జగన్, షర్మిల వేర్వేరుగా పార్టీలు పెట్టాల్సిన అవసరం వచ్చిందని వివరించారు. వైసీపీ సిద్ధాంతం, రాజ్యాంగ నిబద్ధత అంశంపై పార్టీ సీనియర్ నేత, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కీలక ఉపన్యాసం చేశారు. పార్టీ ఆర్థిక నివేదికను జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి.విజయసాయిరెడ్డి పార్టీ శ్రేణుల ముందుంచారు. విద్యా రంగంపై తీర్మానాన్ని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రవేశపెట్టారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, రోజా, ఉషశ్రీ చరణ్ ప్రసంగించారు.

**నలుమూలలా కదిలిన వైసీపీ శ్రేణులు**

రెండు రోజులపాటు జరగనున్న వైసీపీ ప్లీనరీకి రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలి వస్తున్నారు. ప్లీనరీ మొదటి రోజున వైసీపీ నాయకులు, కార్యకర్తలు వెయ్యి కార్లతో భారీ ర్యాలీగా తరలివచ్చారు. దీంతో గుంటూరు-విజయవాడ జాతీయ రహదారి అభిమానులతో కిక్కిరిసింది. వైసీపీ జెండాలు, ఫ్లెక్సీలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌ల ఫ్లెక్సీలు, వైసీపీ జెండాలతో తరలివచ్చారు.

అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహిస్తున్న ప్లీనరీ కావడంతో పార్టీ శ్రేణులు ఆసక్తిగా తరలివస్తున్నారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. ప్లీనరీ భద్రతా విధుల కోసం దాదాపు 3,500 మంది పోలీసులను నియమించారు.

## విస్తారంగా వర్షాలు

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు అనేక ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్ పంటలకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలు కారణంగా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పది రోజులుగా అడపా, దడపా కురుస్తున్న వర్షాలకు మెట్ట పంటలకు విత్తనాలు మొదలయ్యాయి. వేరుశనగ, వరి, మొక్కజొన్న, చెరకు, జనపు నారతోపాటు అనేక వాణిజ్య పంటల విత్తనాలు జల్లుతున్నారు. చురుగ్గా కదులుతున్న నైరుతి రుతుపవనాలకు ఆవర్తనాలు తోడవడంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) దేశంలోని పలు రాష్ట్రాలకు వర్ష సూచన చేసింది. రాగల ఐదు రోజుల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా, రానున్న ఐదు రోజుల పాటు కోస్తాంధ్ర, తెలంగాణ, యానాంలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. విశాఖ నగరంలో భారీ వర్షం లోతట్టు ప్రాంతాలను జలమయం చేసింది. తీరం వెంబడి ఉధృతంగా అలలు ఎగిసిపడుతున్న నేపథ్యంలో మత్యకారులు ఆందోళనకు గురవుతున్నారు.

**హైదరాబాద్‌లో రెడ్ అలర్ట్**

**హైదరాబాద్:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాగల రెండు రోజులు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సంచాలకులు నాగరత్నం తెలిపారు. గడిచిన 24గంటల్లో ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రెండు రోజుల పాటు రెడ్ అలర్ట్, ఆ తరువాత రెండు రోజులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని వెల్లడించారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు సాధారణం కన్నా 45శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైందని వివరించారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీమ్, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, జనగామ, నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసినట్టు హైదరాబాద్ వాతావరణం కేంద్రం పేర్కొంది.

**వరదనీటిలో చిక్కుకున్న స్కూల్ బస్సు**

**మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు వరదనీటిలో చిక్కుకుంది. ఇటీవల విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మాచన్‌పల్లి-కోడూరు మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదనీరు భారీగా చేరింది. ఈ క్రమంలో రామచంద్రపురం నుంచి సుగురు తండాకు వెళ్తున్న స్కూల్ బస్సు.. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదనీటిలో చిక్కుకుంది. దాదాపు సగభాగం వరకు బస్సు నీటిలో ఉండటంతో అందులోని విద్యార్థులు ఆర్తనాదాలు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న స్థానికులు.. విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం బస్సును ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు.

## అమర్‌నాథ్‌లో జలవిలయం

**శ్రీనగర్:** ఆకస్మిక వరదల కారణంగా పదిమంది అమర్‌నాథ్ యాత్రికులు గల్లంతయ్యారు. జమ్ముకశ్మీర్‌లోని అమర్‌నాథ్‌లో గురువారం సాయంత్రం నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. వరదల ధాటికి అమర్‌నాథ్ యాత్రికుల గుడారాలు కొట్టుకుపోయాయి. ఆ గుడారాల్లో ఉన్న యాత్రికులు గల్లంతయ్యారు. గల్లంతైనవారిలో పదిమంది మృతదేహాలు లభించినట్లు సమాచారం. మిగతావారి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాయి. బాధితులను హెలికాప్టర్ల ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అమర్‌నాథ్ పరిసరాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి కుంభవృష్టి కురుస్తోంది. దీంతో సహాయక చర్యలకు కొంత ఆటంకమేర్పడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఐటీబీపీ అధికారులు వెల్లడించారు. వరదల దృష్ట్యా అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. అమర్‌నాథ్‌లోని మంచు లింగాన్ని దర్శించుకోవాలంటే శ్రీనగర్‌కు దాదాపు 90కి.మీ దూరంలో పహల్గామ్‌తోపాటు బాల్తాల్ పట్టణాల మీదుగా రెండు మార్గాలు ఉంటాయి. ఆయా మార్గాల్లోని బేస్ క్యాంపుల నుంచి బ్యాచ్‌ల వారీగా యాత్రికులను పంపిస్తారు. ఈ క్రమంలో ప్రతికూల వాతావరణం కారణంగా గత మంగళవారం యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. అనంతరం వాతావరణం అనుకూలించడంతో మళ్లీ పునరుద్ధరించారు. జూన్ 30న ప్రారంభమైన ఈ యాత్రలో ఇప్పటికే లక్ష మంది భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## వంట నూనెల ధర రూ.15 తగ్గింపు?

(మొదటిపేజీ తరువాయి)

తగ్గించాలని సూచించాం' అని ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో వంట నూనెల ధరలు, లభ్యతను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని పేర్కొన్న మంత్రిత్వ శాఖ, వంట నూనెలపై తగ్గిన సుంకం, అంతర్జాతీయ ధరల నిరంతర గణనీయమైన తగ్గుదల ప్రయోజనాలను అంతిమ వినియోగదారులకు తక్షణమే బదిలీ అవుతుందని తెలిపింది. 'వినియోగదారులు తమ వంటగది బడ్జెట్‌లో కొంత అదనపు డబ్బును ఆదా చేసేందుకు ఎదురుచూడ వచ్చు' అని పేర్కొంది. జులై 6న జరిగిన సమావేశంలో దిగుమతి చేసుకున్న వంట నూనెల అంతర్జాతీయ ధరలు తగ్గుముఖం పట్టడం 'చాలా సానుకూల పరిణామం' అని తయారీదారులు, శుద్ధి కంపెనీలకు సమాచారం అందించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. 'అందువల్ల దేశీయ మార్కెట్‌లో ధరలు కూడా తగ్గుముఖం పట్టేలా దేశీయ ఆహార నూనెల పరిశ్రమ నిర్ధారించుకోవాలి. ఈ ధర తగ్గింపును వినియోగదారులకు త్వరితగతిన అందించాలి' అని కోరింది. బుధవారం జరిగిన సమావేశం లో ధరల వివరాల సేకరణ, వంట నూనెలపై నియంత్రణ క్రమం, ప్యాకేజీ వంటి అంశాలపైనా చర్చించారు.

గత ఒక నెలలో వివిధ వంట నూనెల ప్రపంచ ధరలు టన్నుకు 300 నుంచి 450 డాలర్లకు పడిపోయాయని పరిశ్రమ తెలియజేసింది. అయితే రిటైల్ మార్కెట్లలో ప్రతిబింబించడానికి సమయం పడుతుందని, రాబోయే రోజుల్లో రిటైల్ ధరలు తగ్గుతాయని భావిస్తున్నట్లు ఆ ప్రకటన వివరించింది. మే నెలలో ఫార్చ్యూన్ బ్రాండ్ శుద్ధి చేసిన సన్‌ఫ్లవర్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్, కాచి ఘనీ ఆయిల్ గరిష్ఠ రిటైల్ ధరను లీటరుకు రూ.10 తగ్గించింది. కాగా దిగుమతి సుంకాన్ని తగ్గించిన నేపథ్యంలో వంట నూనెల ధరలను తగ్గించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

అంతర్జాతీయ మార్కెట్‌లో వంట నూనెల ధరలు అనూహ్యంగా పతనమవుతున్నాయని, అయితే, ధరలు క్రమంగా తగ్గుతున్నందున దేశీయ మార్కెట్‌లో పరిస్థితి కొద్దిగా భిన్నంగా ఉందని పేర్కొంది.

## 19 నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

స్పీకర్‌గా కోన రఘుపతి వ్యవహరిస్తుండగా, ఆ స్థానంలో కొలగొట్ల ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. స్పీకర్ తమ్మినేని సీతారామ్‌ను మాత్రం కొనసాగించాలని సీఎం నిర్ణయించారు. ఇక వర్షాకాల సమావేశాల్లో కీలకమైన కొన్ని బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు నిర్వహిస్తోంది. ఈ మూడేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, జరిగిన రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ పరంగా తీసుకున్న కొన్ని నిర్ణయాల పైన చర్చించే అవకాశం ఉంది.

## దారుణహత్య

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు అరెస్టు చేశారు. ప్రపంచంలోని అత్యంత సురక్షిత దేశాల్లో జపాన్ ఒకటి కాగా ఇక్కడ మారణాయుధాల నియంత్రణ చట్టాలు కఠినంగా ఉంటాయి. షింజో అబే కాల్చివేత గురించి తెలిసి వేర్వేరు ప్రాంతాల్లో ప్రచారంతో బిజీగా ఉన్న ప్రధాని ఫ్యూమియో కిషిడా, కేబినెట్ మంత్రులు వెంటనే టోక్యోకు తిరిగొచ్చారు. జపాన్‌కు అత్యధిక కాలం ప్రధానిగా సేవలు అందించిన అబే 2020లో గద్దెదిగారు.

**వీడియోలు వైరల్:**

ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాలతో పాటు వార్తా ఛానళ్లలో కనిపించాయి. ప్రచారాధికారులు కింద పడిపోయిన అబేను చుట్టుముట్టి ఉండటం వాటిలో కనిపించింది. అబే మరణానికి ముందు జరిగిన ఘటనల వీడియోను ఎన్‌హెచ్‌కే టీవీ ప్రసారం చేసింది. నీలం రంగు సూటు ధరించి...పిడికిలి బిగించి చేయి పైకెత్తి నరా రైల్వేస్టేషన్ బయట అబే ప్రసంగిస్తున్న సమయంలో ఆయనపై రెండుసార్లు కాల్పులు జరిగాయి. అబే రోడ్డుపై కుప్పకూలిపోయారు. భద్రతా సిబ్బంది ఆయన వద్దకు పరుగు పరుగున చేరుకున్నారు. అబే చొక్కా రక్తంతో తడిచి ఆయన ఛాతి పట్టుకొని ఉన్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి.

బూడిద రంగు చొక్కా ధరించిన వ్యక్తిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకోవడం, అతని నుంచి తుపాకీని స్వాధీనం చేసుకోవడం కనిపించింది. నిందితుడిని తెత్సుయా యమాగామి(41)గా పోలీసులు గుర్తించారు. ఇతను గతంలో మూడేళ్ల పాటు మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (సముద్ర స్వీయరక్షణ దళం)లో పనిచేసినట్లు ఎన్‌హెచ్‌కే వార్తాఛానల్ పేర్కొంది. అబేపై యమాగామి ఎందుకు కాల్పులు జరిపారో తెలియలేదు. తుపాకీతో సభా ప్రాంగణంలోకి ఎలా ప్రవేశించదాన్న దానిపై ఆరా తీస్తున్నారు. భద్రతాలోపాలపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రెస్ కెమెరాగా భ్రమపెట్టి ఆయుధాన్ని తీసుకొచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు.

**ప్రధాని కిషిడా ఖండన:**

అబే హత్యను అత్యంత తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రధాని కిషిడా భావోద్వేగానికి గురయ్యారు. భద్రతా పరిస్థితిని సమీక్షించాలని ప్రభుత్వం యోచించిందిగానీ అబేకు అత్యధిక భద్రతను కల్పించిందని చెప్పారు. అబే కాల్చివేత జపాన్ ప్రజాస్వామానికి సవాల్ విసురుతోందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు.

**అబేకు అరుదైన వ్యాధి:**

యుక్తవయసు నుంచే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు అబే గతంలో వెల్లడించారు. అదే కారణంగా ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రాజీనామా సమయంలో అల్సరేటివ్ కొలైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. అనేక లక్ష్యాలను అసంపూర్ణంగా వదిలి వెళ్లడం బాధిస్తోందని చెప్పారు. ఉత్తర కొరియా చాలా ఏళ్ల కిందట జపనీయులను అపహరించిన అంశాన్ని పరిష్కరించడంలో విఫలమైనట్లు వెల్లడించారు. అబే తన 52వ ఏట అంటే 2006లో జపాన్ ప్రధానిగా ఎన్నికయ్యారు.

అతిపిన్న వయస్సు ప్రధానిగా నిలిచారు. ఈయన రాజకీయ ప్రస్థానం ఒడిదుడుకుల మధ్య సాగింది. ఆరుసార్లు సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందారు. తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. జపాన్‌ను అభివృద్ధి పథంలో నడిపారు. ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చారు. జపాన్, అమెరికా మధ్య మైత్రిని బలోపేతం చేశారు. బడుల్లో దేశభక్తి పాఠాలు చెప్పించి అంతర్జాతీయ స్థాయిలో జపాన్ ప్రతిష్ఠను పెంచారు. తనకున్న వ్యాధి తిరగబెట్టినందున 2020లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు.

**అబే భారత్‌కు ఆత్మీయుడు: మోదీ**

షింజో అబే భారత్‌కు ఆత్మీయుడని, తనకు ఆప్త మిత్రుడని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అబే హత్యను ఖండిస్తూ ఆయన మరణానికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రపంచాన్ని మెరుగైన స్థలిగా మార్చేందుకు అబే నిబద్ధతతో పనిచేశారని శ్లాఘించారు. అబే మరణానికి సంతాపంగా జులై 9న(నేడు) భారత్‌లో సంతాప దినంగా పాటిస్తామని ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. భావోద్వేగంగా ట్వీట్లు చేశారు. ఇటీవల జపాన్‌కు వెళ్లినప్పుడు అబేను కలిసి అనేక అంశాలపై చర్చించినట్లు గుర్తుచేసుకున్నారు. అదే తమ చివరి సమావేశం అవుతుందని అనుకోలేదన్నారు. అబే హత్య తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆత్మీయ మిత్రుల్లో ఒకరిని కోల్పోవడం తీవ్రంగా బాధించిందని మోదీ పేర్కొన్నారు.

అబే అద్భుతమైన నాయకుడని కొనియాడారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే అబేతో పరిచయం ఉందన్నారు. అబే కుటుంబానికి, జపాన్ ప్రజలకు సానుభూతిని ప్రకటించారు. భారత్-జపాన్ మధ్య ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యం పెరగడానికి అబే కారణమన్నారు. ఈ కష్టసమయంలో జపాన్‌కు భారత్ తరపున సంఘీభావాన్ని ప్రకటించిన మోదీ..ఇటీవల టోక్యోలో అబేతో కలిసి దిగిన ఫొటోను పంచుకున్నారు.

# వైసీపీ ప్లీనరీ కాదు.. డ్రామా గ్యాలరీ

- అధికార దుర్వినియోగంతో ఆర్టీసీకి రూ.10 కోట్లు నష్టం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల సభలు, సమావేశాలు, పాదయాత్రలకు అనేక సాకులు చెప్పి అనుమతించకుండా అడ్డంకులు సృష్టించే ప్రభుత్వం వైసీపీ ప్లీనరీకి మాత్రం ఏర్పాట్లలో పూర్తిగా ఎలా నిమగ్నమైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారపక్షానికి ఒక న్యాయం ప్రతిపక్షానికి మరొక న్యాయమా? అని ప్రశ్నించారు. రాజ్యాంగం అందరికి సమానమే అన్న విషయాన్ని జగన్ రెడ్డి మర్చిపోయారు. తెలుగుదేశం పార్టీ మహానాడు జరుపుకోవాలంటే అనేక అడ్డంకులు సృష్టించారు. ఆఖరికి పోలీసులతో వాహనాల టైర్లలో గాలి తీయించారు. రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయినా పోలీసులు పట్టించుకోలేదు. ఆర్టీసీ బస్సులకు అనుమతి ఇవ్వలేదు. ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలకు షరతులు పెట్టారు. పైపెచ్చు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రకరకాల ఇబ్బందులకు గురి చేశారు. రాజధాని రైతులు న్యాయస్థానం టు దేవస్థానం పాద యాత్ర చేస్తామంటే అనుమతినివ్వలేదు. ఎట్టకేలకు పాదయాత్ర చేపడితే అనేక అవాంతరాలు సృష్టించారు. నేడు వైసీపీ ప్లీనరీకి మాత్రం అధికారులు రెడ్ కార్పెట్ వేసి మరీ సేవలు చేస్తున్నారు. నాగార్జున యూనివర్సిటీలో విద్యార్థులకు పరీక్షలు ఉన్నప్పటికీ బలవంతంగా రెండు రోజులు సెలవులిచ్చారు. స్కూల్ బస్సులను పాఠశాలల నుంచి లాక్కుని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారు. ఆర్టీసీ బస్సులను ఇష్టానుసారంగా ప్లీనరీకి ఉపయోగిస్తున్నారు. ఐదు జిల్లాల నుంచి రెండు రోజుల పాటు దాదాపు 1,812 బస్సులను వినియోగిస్తున్నారు. రోజుకి ఒక బస్సుకు రూ.30 వేల ఆదాయం చొప్పున 1,812 బస్సులకు రెండు రోజులకు గాను దాదాపు రూ.10.87 కోట్ల ఆదాయం ఆర్టీసీకి నష్టం వాటిల్లుతుంది. మరోపక్క జాతీయ రహదారిని పోలీసులు పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నారు. చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై వందలాది వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో ప్రజలు అనేక అవస్థలకు గురయ్యారని ఆయన పేర్కొన్నారు.

## నవ మోసాలు: యనమల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్లీనరీలో ఆత్మస్తుతి పరనింద తప్ప ఆత్మావలోకనంగానీ, ఆత్మపరిశీలనగానీ లేదని శాసన మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం మూడేళ్ల పాలనా కాలంలో రూ.5 లక్షల కోట్లు అప్పులు చేసిన సీఎం జగన్, ప్రజలకు సంక్షేమ పథకాల కింద ఖర్చు చేసింది మాత్రం లక్షన్నర కోట్లేనని, మిగిలిన మూడున్నర లక్షల కోట్లు ఏమయ్యాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారు. ధరలు, పన్నుల తగ్గింపు, మోటర్లకు మీటర్ల ఉపసంహరణ, ఉద్యోగ ఖాళీల భర్తీ, పాఠశాలల విలీనం ఉపసంహరణ, మహిళలపై అత్యాచారాలు, హత్యల నివారణ, సీపీఎస్ రద్దు, ప్రత్యేక హోదా సహా విభజన చట్టం హక్కుల సాధన, బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దారి మళ్లింపు, దుల్హన్ పునరుద్ధరణ, మద్యనిషేధం, ఇసుక రేట్లు తగ్గింపు తదితర సమస్యలపై ప్లీనరీలో చర్చించి సానుకూల నిర్ణయాలు ప్రకటిస్తారని ఎదురు చూసిన ప్రజలకు ప్లీనరీ జరిగిన తీరు నిరాశ పరిచిందన్నారు. తల్లిని పార్టీ నుంచి తొలగించడానికి, తనను పొగిడించుకోవడానికి, టీడీపీ, జనసేనను తిట్టడానికే ప్లీనరీ నిర్వహించినట్లుగా ఉన్నదని ఆయన విమర్శించారు. అలాగే జగన్ రెడ్డి ప్రసంగంలో అబద్ధాలు తప్ప వాస్తవాలు లేవన్నారు. మేనిఫెస్టో హామీలు 95 శాతం అమలు చేశామని చెప్పడం పెద్ద అబద్ధం అన్నారు. మద్య నిషేధం విధిస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు మందుబాబులను తాకట్టు పెట్టి రూ.33 వేల కోట్లు అప్పు తెచ్చారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ టీడీపీ ప్రభుత్వం 16 లక్షల మందికి ఇవ్వగా దాన్ని 10 లక్షల మందికి కుదించారు. అమ్మఒడితో రూ.15 వేలు ఇస్తానని నమ్మించి రూ.13 వేలు ఇస్తూ మరోపక్క నాన్న బుడ్డీ ద్వారా రూ.70 వేలు గుంజుకుంటున్నారు. పింఛన్లు రూ.3 వేలు ఇస్తానని నమ్మించి మూడేళ్లయిన తర్వాత కూడా రూ.2,500లే ఇస్తున్నారు. రైతు భరోసా పేరుతో ఐదేళ్లలో కలిగే లబ్ధిని రూ.37,500కి కుదించి రైతులను మోసం చేశారని యనమల ధ్వజమెత్తారు.

## దళిత యువకులను తక్షణమే విడుదల చేయాలి

### డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్

విశాలాంధ్ర-రావులపాలెం: అంబేద్కర్ ఫొటో ముద్రించి వ్యాపారం చేస్తున్నారన్న అనుమానంతో ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి 18మంది దళిత యువకులు అక్రమంగా అరెస్టు చేసిన ఘటనపై సీపీఐ దళిత హక్కుల పోరాట సమితి, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం తదితర సంఘాల నాయకులు శుక్రవారం గోపాలపురంలో పర్యటించారు. అరెస్టయిన యువకుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం స్థానిక రామాలయంలో సమావేశం జరిగింది. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండా వ్యాపారం చేస్తున్న వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం, జరిగిన ఘటనకు సంబంధం లేని సెక్షన్ నమోదు చేయడం పూర్తిగా రాజకీయ కుట్రని విమర్శించారు. కాకినాడలో ఎమ్మెల్సీ అనంత బాబు దళితుని హత్యచేసిన మూడు రోజులు వరకు అరెస్టు చేయలేని ఈ పోలీసులు ఫిర్యాదు చేసిన మరుక్షణం దళితులపై అత్యుత్సాహం ప్రదర్శించి కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన దళితుల్ని విడుదల చేయకపోతే ఉద్యమాన్ని రాష్ట్రస్థాయి ఉద్యమంగా చేపడతామని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సీపీఐ కార్యదర్శి కె.సత్తిబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, కాకినాడ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ శాఖ రామకృష్ణ, మున్సిపల్ నాయకులు బొబ్బిలి శ్రీనివాస్, అలమూరు శ్యామ్, రామిరెడ్డి, రామకృష్ణ, ఎస్టీయూ యేసు రాజు, కొనాల అంబేద్కర్, ఏఐఎస్ఎఫ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓ కార్యాలయానికి తాళం

విశాలాంధ్ర-వెల్దుర్తి: పాఠశాలకు వెళ్లాలంటే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, దీంతో తమ చిన్నారులు బడికి వెళ్లి వచ్చేంత వరకూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే ఉండాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు శుక్రవారం ఎంఈఓ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. వారంతా భారీ ర్యాలీ చేపట్టి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ 'వెల్దుర్తిలో పెద్ద లారీలు రోడ్లపై తిరుగుతుంటాయి. అక్కడే వ్యాపారులు బండ్లపై అమ్మకాలు చేస్తుంటారు. ప్రయాణికులు ఎక్కువమంది రోడ్డుపై ఉండటంతో తీవ్ర సమస్యగా మారింది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదు. చేజేతులారా మా పిల్లల్ని చంపుకోలేం. చదువు లేకపోయినా పరవాలేదు. ఎలాగో అలా వారికి బతికించుకుంటాం' అని తెగేసి చెప్పారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖాధికారి తమ చిన్నారుల కష్టాలు తెలుసుకుని ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని కోరారు.

## పాల ఉత్పత్తులపై జీఎస్టీ విరమించాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాల ఉత్పత్తులపై జీఎస్టీ 12 నుంచి 18శాతానికి పెంచే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయం సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో రైతుల, కూలీల జీవనోపాధికి, పాడి ఆదరువుగా ఉందన్నారు. జీఎస్టీ పెంపుతో అదికూడా కుదేలవుతుందని చెప్పారు. జీఎస్టీ కౌన్సిల్ ప్రతిపాదనలను అమలు పరిస్తే, సహకార పాడి డెయిరీలపై మోయలేని భారం పడుతుందన్నారు. పాల ఉత్పత్తులను వినియోగించే ప్రజలపై భారం పడే ప్రమాదముందని పేర్కొన్నారు. దీనికి తోడు పాల సరఫరా చేసే గ్రామ పాల సొసైటీలపై ప్రభావం పడుతుందని వివరించారు. రైతులకు చెల్లించే పాల ధరలో కోతలు విధించడం, బోనస్‌లు తగ్గించడం తప్పనిసరి అవుతుందన్నారు. జీఎస్టీ రద్దు చేసేలా, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లీటరుకు రూ.4 సబ్సిడీ ఇస్తామని ప్రకటించిందన్నారు. పాల ఉత్పత్తులపైన, పరికరాలపైన పెంచిన జీఎస్టీ ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న లీటరుకు రూ.4 బోనస్ రైతులందరికీ ఇవ్వాలని, 50శాతం సబ్సిడీపై పాడి గేదెలు ఇచ్చి జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

## 18 నుంచి బేవరేజెస్ హమాలీల సమ్మె

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం ద్వారా దాదాపు 25 వేల కోట్లు అదాయం వస్తున్నా అందులో పని చేసే బేవరేజస్ కార్పొరేషన్ ఐఎంఎఫ్ఎల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీలకు మాత్రం వేతనాలు పెంచకపోవడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తక్షణం వారి సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచకపోతే ఈనెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రవీంద్రనాథ్ హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏఎంఎఫ్ఎల్, ఏపీబీసీఎల్ డిపోస్ హమాలీస్ జేఏసీ అధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది అక్టోబర్ 30తో గత వేతన ఒప్పందం ముగిసినప్పటికీ తొమ్మిది నెలలుగా ఎగుమతి కూలి రేట్లు పెంచకుండా సిగ్మా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూలి రేట్ల సమస్యలు పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కించడంపై జేఏసీ తరపున తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా సిగ్మా కంపెనీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎగుమతి కూలిరేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 29 ఏపీఎస్‌సీఎల్ అండ్ ఐఎంఎఫ్ఎల్ డిపోస్ గోదాముల్లో దాదాపు 3వేల మంది హమాలీలు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. హమాలీ కార్మికుల శ్రమ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి 25 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతున్న వారి సంక్షేమానికి ఒక్క పైసా కూడా కేటాయించడంలేదన్నారు. ఏళ్ల తరబడి కార్మికులకు ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డులు, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతూనే ఉన్నాయన్నారు. ప్రమాదాలలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం కూడా చెల్లించడంలేదన్నారు. దీని మూలంగా ఆ కార్మికుల కుటుంబాలు వీధులపాలౌతున్నా యన్నారు. జగన్ ప్రభుత్వం కార్మికులందరికీ మేలు చేస్తామని వాగ్దానం చేసిందనీ, కానీ బేవరేజస్ హమాలీలకు ఏ ఒక్క ప్రయోజనాన్ని చేకూర్చలేదన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ బేవరేజస్ కార్పొరేషన్ ఐఎంఎఫ్ ఎల్ డిపోలలో పనిచేస్తున్న హమాలీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి సమ్మెలోకి వెళ్ళక తప్పదన్నారు. దీన్లో భాగంగా ఈనెల 15న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దానిని జయప్రదం చేయాలని హమాలీలకు విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ, జేఏసీ నాయకులు ఎల్‌వి లోకేశ్వరరావు, స్టీఫెన్‌బాబు, ఎన్.వి.సుబ్బారెడ్డి, వి.కొండలరావు పాల్గొన్నారు.

## కేంద్రం దిగి వచ్చేవరకు పోరు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన వచ్చే వరకు పోరాటం ఆగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారానికి 512వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నేతలు జీ బోసుబాబు, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, కె.ఎస్.ఎన్.రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రం కుట్రలు పన్నుతోందని, ఉక్కులోని కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి అప్పజెప్పడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరణ చేసి ప్లాంట్ మొత్తాన్ని నిర్వీర్యం చేసే దిశగా పన్నాగాలు పన్నుతోందన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలతోనే ఉక్కును కాపాడుకోగలమన్నారు. ఇషా ఫౌండేషన్ ప్రతినిధి ఆర్య దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ ఉక్కును కాపాడుకుంటేనే భావితరాలకు భవిష్యత్ ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకోసం 'ఇచ్ఛాపురం నుంచి హిందూపూర్" వరకు భూమిని రక్షించండి, మొక్కలు పెంచాలని అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. శుక్రవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటిస్తున్నానని తెలిపారు. ఈ దీక్షల్లో ట్రాఫిక్ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు. నాయకులు కె.పరంధామయ్య, ఎస్.మోహన్ బాబు, ఉద్యోగులు ఎం.త్రిమూర్తులు, జీ శ్రీనివాస్, జె.రామన్న, భాస్కర్, ఎస్ బాబురావు, హరినాథ్, పాపారావు, ఎస్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయుడు మోదుమూడి శ్రీహరిరావు

### ఘనంగా 23వ వర్ధంతి

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: నేటి యువతకు ఆదర్శనీయుడు, మార్గదర్శకుడు మోదుమూడి శ్రీహరిరావు అనీ, ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రజా అభ్యుదయ సంక్షేమ సంఘంలో సీపీఐ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు అధ్యక్షతన మోదుమూడి శ్రీహరిరావు 23వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. శ్రీహరిరావు చిత్రపటానికి నార్ల వెంకటేశ్వరరావు పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ప్రజల పక్షాన నిలబడి భూస్వాములకు ఎదురొడ్డి పేద ప్రజలకు భూమి ఉండాలని సంకల్పించి అనేక పోరాటాలు చేసి విజయం సాధించిన ఘనత శ్రీహరిరావుకే దక్కుతుందని నార్ల వెంకటేశ్వరరావు అన్నారు. పార్టీ అధ్వర్యంలో 10 లక్షల ఎకరాల వరకు పేదలకు పట్టాలు ఇప్పించిన వారిలో శ్రీహరిరావు ఒకరని, పేదల పక్షాన పోరాడేందుకు ఒక సైనికుడిలా ఉండేవారని, గ్రామాల వెంట తిరుగుతూ ఎంతోమందిని ఉద్యమ స్ఫూర్తి నింపిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం వల్ల దేశానికి ప్రమాదం పొంచివున్నదని నార్ల పేర్కొన్నారు. డాక్టర్ కుప్ప రామస్వామి మాట్లాడుతూ శ్రీహరిరావులాంటి వ్యక్తి మనందరికీ స్ఫూర్తిదాయకమని అటువంటి ఆయన అడుగుజాడల్లో ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా కమ్యూనిస్టు పార్టీ భావాలతో నడవడం ఎంతో గొప్ప విషయం అన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీహరిరావు గొప్ప ఉన్నతమైన వ్యక్తి అని, వైసీపీ. టీడీపీలు మన ఆంధ్రాలోనే ఉంటాయి తప్ప, కమ్యూనిస్ట్ పార్టీ అనేది ప్రపంచంలో నలుమూలల ఉందని ఆయన గుర్తు చేశారు. సీపీఐ నాయకురాలు దేవభక్తుని నిర్మల మాట్లాడుతూ శ్రీహరిరావులాంటి నాయకుడి సమక్షంలో ఆయనతో పాటు నడిచి కుగ్రామాల్లో పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేశామన్నారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ క్రమశిక్షణతో ఏ విధంగా నడవాలి, పార్టీ ఏ విధంగా నడపాలని స్ఫూర్తి నింపిన మహనీయుడు కడుపున పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రజల తరపున పోరాటాలు చేస్తున్నామంటే ఆయన నింపిన స్ఫూర్తి కారణమని తెలిపారు. వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దగాని సంగీత రావు మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం దివిసీమలో నుంచి బందరు వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేసిన ధీశాలి శ్రీహరిరావు అని, పార్టీ కోసం, పేదల కోసం ఎన్నో భూ పోరాటాలు చేసి అందులో ముఖ్యమైన చల్లపల్లి జమిందారు భూములు పేదలకు పంచే విషయంలో ఎక్కడ రాజీపడని మహోన్నత వ్యక్తి అని ఆయన కొనియాడారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిముక్కుల రాణి మాట్లాడుతూ శ్రీహరిరావు వర్ధంతి కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంత అదృష్టమన్నారు. మరపురాని మహామనిషిగా ఆయన అడుగు జాడల్లో మనందరం నడవాలని కోరారు. కోదాటి నారాయణరావు, సీపీఐ పెడన కార్యదర్శి తూము చిన్న కొండయ్య, గుర్రం వెంకటేశ్వరరావు, కర్రపాటి సత్యనారాయణ, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శులు కే గగన్, ఒడుగు చైతన్య కుమార్ పాల్గొన్నారు.

## శాంతి సామరస్యాలకు ఆధ్యాత్మికత హేతువు

### ఇస్కాన్ జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన గవర్నర్ విశ్వభూషణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆధ్యాత్మికత ప్రజల మధ్య శాంతి సామరస్యాలకు హేతువుగా నిలుస్తుందని, జగన్నాథుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. మానవ ప్రయత్నానికి అండగా దైవ సంకల్పం తోడైతే అంతా శుభమే జరుగుతుందన్నారు. ఇస్కాన్ దేవాలయం అధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రను శుక్రవారం గవర్నర్ విజయవాడ వజ్ర గ్రౌండ్స్ నుంచి ప్రారంభించారు. రథ పూజతో జగన్నాథ రథయాత్రను తొలిసారి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పూరి జగన్నాథ రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధి పొందిందన్నారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద భక్తి సమూహంగా పూరి రథయాత్ర నిలిచిందన్నారు. ఇస్కాన్ దేవాలయ ప్రతినిధులు మంచి కార్యక్రమాన్ని ఎంచుకున్నారని, ఈ రోజు 80కి పైగా దేశాలలో సుమారు 400 వరకు రథయాత్రలు ఇస్కాన్ నేతృత్వంలో భక్తజనావళి అధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. విజయవాడలో తొలిసారి రథయాత్రను చేపడుతున్నప్పటికీ జగన్నాథుని ఆశీస్సులతో ఇది భవిష్యత్తులో అతిపెద్ద రథయాత్రగా రూపుదిద్దుకుంటుందన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణా మండలి అధ్యక్షులు ఎకె ఫరీడా, ఇస్కాన్ దేవాలయ అధ్యక్షుడు చక్రధారి దాస్, వేణుధారి దాస్, శ్యామసుందర అత్యుత దాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా 'జిమ్‌సర్' పట్టభద్రుల దినోత్సవం

### 116 మందికి ఎంబీబీఎస్ డిగ్రీల ప్రదానం

విశాలాంధ్ర-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్యకళాశాల 2016-17 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల పట్టభద్రుల దినోత్సవాన్ని శుక్రవారం వైద్యకళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మొత్తం 116 మంది వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వైద్య డిగ్రీలను అందుకున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ కాలేయ మార్పిడి, గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యుడు డాక్టర్ సుబ్రత్ కుమార్ ఆచార్య ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగించారు. వైద్య విజ్ఞానం రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతోందని, వైద్య విద్యార్థులు, అధ్యాపకులు నిరంతరం తమ వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. వైద్య విద్యలో యూజీ కోర్సుల్లో విద్యార్థులకు సరైన మార్గదర్శకం అవసరమన్నారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ వైద్య వృత్తిని స్వీకరించే వారు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి సేవలందించినప్పుడే వృత్తికి న్యాయం చేసిన వారవుతారన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జయశంకర్ ఇ.వారియర్ విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతితో గీతంలో ఈ ఏడాది నుంచి 14 వైద్య పీజీ కోర్సుల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గీతం మెడికల్ సైన్సెస్ ప్రో-వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ వైద్య విద్యలో వస్తున్న మార్పులను వివరిస్తూ యువ వైద్యులు నిరంతర విద్య ద్వారా తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.జ్యోతిపద్మజ వార్షిక నివేదికను సమర్పించారు. వైద్య వృత్తిని విలువలతో నిర్వహిస్తామని, సమాజ సేవకు ప్రాధాన్యతను ఇస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గీతం క్యాంపస్ లైఫ్ ప్రో-వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన షేక్ ఆశకు గీతం ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్‌ను గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ అందజేశారు.

## ఫీజులు కడితేనే కాలేజీకి రండి

- ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల అల్టిమేటం
- 'జగనన్న మా ఫీజులు ఇప్పించాలి' అంటూ డీ ఫార్మసీ విద్యార్థుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: జిల్లా వ్యాప్తంగా డీ-ఫార్మసీ విద్యార్థులకు పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ డీ-ఫార్మసీ విద్యార్థులు వారి తల్లితండ్రులతో కలిసి కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు గౌడ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ నాలుగేళ్లుగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులందరినీ 'కచ్చితంగా ఫీజులు చెల్లిస్తేనే కళాశాలకు రండి లేకపోతే రావద్దు' అని తెగేసి చెప్పాయని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో రోడ్డెక్కి ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. 'ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు రాకపోయినా మేం ఫీజులు చెల్లిస్తాం' అంటూ అగ్రిమెంట్ బాండ్లు రాసివ్వాలని ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు డిమాండ్ చేశాయని, పరీక్షలు, ఇంటర్న్‌షిప్, ప్రాక్టికల్స్‌కు దూరం చేశాయన్నారు. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తానని హామీ ఇస్తేనే పిల్లల్ని కళాశాలలోచేర్చామని, ఇప్పుడు ఇవ్వకుంటే, లక్షలకు లక్షలు ఎక్కడ నుంచి కట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారన్నారు. కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని, రీయింబర్స్‌మెంట్ ఇవ్వమని ప్రభుత్వం చెబితే అసలు కాలేజీలో చేరేవారమే కాదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా రోడ్డుమీద పడేస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, శరత్ కుమార్, మునిస్వామి, ఏఐవైఎఫ్ నాయకులు మునిస్వామి, డిఫార్మసీ విద్యార్థులు సుప్రియ, పవిత్ర, ప్రియాంక, సీనా, శ్రీలత, భువన, సుహాసిని, యోగేష్, సంధ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అనవసర రగడ

సంపాదకీయం

అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి ఉత్తమ మార్గం ఇతరేతర అంశాల మీద వివాదాలు రేకెత్తించడం. నిర్హేతుకత రాజ్యమేలుతున్న తరుణంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉండే అవకాశమే లేదు. లోకసభలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రా కాళిక దేవి మీద చేసిన వ్యాఖ్యలలో నిజా నిజాలేమిటి అన్న విషయాన్ని పక్కన పెడితే ఆమె అభిప్రాయాలు తీవ్ర వివాదం రేకెత్తించాయి. ఎక్కడో ఎవరో ఒక వ్యాఖ్య చేస్తే మరెక్కడో పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోలీసులు సత్వరం ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయడం సర్వసాధారణమైంది. మధ్యప్రదేశ్‌లో ఓ టీకొట్టు నడిపే వ్యక్తి మొయిత్రా మీద ఫిర్యాదు చేస్తే పోలీసులు వెంటనే ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. ఈ ఫిర్యాదు స్ఫూర్తితో బెంగాల్ లో కూడా మరి కొంతమంది ఆమె మీద ఫిర్యాదు చేశారు. ఒక అపరాధం రుజువైతే దానికి ఒకే శిక్ష ఉంటుందని తెలిసినా ఇలా వరసపెట్టి ఫిర్యాదులు దాఖలు చేయడంలో ఆంతర్యం తాము వార్తల్లోకి ఎక్కాలన్న ఆరాటమే. మహమ్మద్ ప్రవక్త మీద బీజేపీ అధికార ప్రతినిధి హోదాలో నూపుర్ శర్మ ప్రతికూల వ్యాఖ్యలు చేసినప్పుడు కూడా ఇలాగే అనేక చోట్ల ఎఫ్.ఐ.ఆర్.లు దాఖలైనాయి. ఇన్ని చోట్ల విచారణకు హాజరు కావడం సాధ్యం కాదుగనక అన్నింటినీ దిల్లీకి మార్చాలని అర్జీ పెట్టుకోవడం ఆమె హక్కు. కానీ ఘనత వహించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సూర్యకాంత్, పార్దీవాలా తమ ముందు విచారణకు వచ్చిన అంశాన్ని పరిశీలించడం మానేసి నూపుర్ శర్మ మీద విరుచుకుపడ్డారు. న్యాయమూర్తులు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటే ప్రజలకు ఇక దిక్కెవరో చెప్పడం కష్టం. ప్రత్యర్థులుగా ఉన్న రాజకీయ పక్షాల నాయకులు కూడా ఏ అంశం తలెత్తినా వెంటనే ఖండన మండనలకు పాల్పడుతున్నారు. ఎదుటి వారు అవునన్నది కాదనే ధోరణే తప్ప తమ వాదన హేతుబద్ధమా కాదా అన్న ఆలోచనే లేదు. ఎఫ్.ఐ.ఆర్.లు దాఖలు చేసే వారికన్నా ప్రత్యర్థి పక్షాల నాయకులు ఒకడుగు ముందుకు వేసి మహువా మొయిత్రాను అరెస్టు చేయాలని డిమాండు చేస్తున్నారు. బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష బీజేపీ నాయకుడు సువేందు అధికారి ఆత్రం మరీ ఏహ్యంగా ఉంది. మత భావాలకు విఘాతం కల్గించి నందుకు మహువా మొయిత్రాను అరెస్టు చేయాలంటున్న బీజేపీ నాయకు లకు నూపుర్ శర్మ వ్యాఖ్యలూ బేసబబే అన్న ఆలోచన ఎందుకు తట్టదో అంతుపట్టదు. మహువా, నూపుర్ శర్మ వ్యాఖ్యలు రెండూ అభ్యంతర కరమైనవే అనుకుంటే తీసుకోవలసిన చర్య కూడా సమానం గానే ఉండాలి. ప్రజల మనోభావాలకు విఘాతం కలిగించే వ్యాఖ్యలు చేసిన ఈ ఇద్దరి వైఖరిలో ఒక తేడా మాత్రం గమనించవచ్చు. మహువా మొయిత్రా తాను అనుసరించే మతానికి సంబంధించిన దేవత మీద ప్రతికూల వ్యాఖ్యలు చేస్తే నూపుర్ శర్మ ఇస్లాం మత ప్రవక్త మీద విరుచుకుపడ్డారు. మహువా మొయిత్రాను అరెస్టు చేయాలని కోరే సువేందు అధికారి లాంటి వారికి నూపుర్ శర్మకు కూడా అదే సూత్రం వర్తింపచేయాలన్న ఊహే తట్టకపో వడం విచిత్రమే. మహువా మొయిత్ర మాత్రం తాను కాళికాదేవి భక్తురాలినే నంటున్నారు. తాను ఆరాధించే దేవత ఎలా ఉంటుందో ఊహించుకునే హక్కు తనకు ఉందంటు న్నారు. మహువా మొయిత్ర, నూపుర్ శర్మ వ్యాఖ్యలు సబబైనవా కావా, హేతుబద్ధమైనవా కావా అన్న చర్చ ఎటూ తెగేది కాదు. భక్తి విశ్వాసాలు హేతువుకు అందేవి కావు. ఏకోశ్వరోపాసన, బహుదేవతా రాధన అన్న తేడాలు రావడానికి ప్రధాన కారణం విశ్వాసాలలో హేతుబద్ధత లేకపోవడమే. విశ్వాసం శాస్త్ర పరిశీలనకు కూడా లొంగదు. పిడివాదం ఏ మతానికైనా ప్రధాన ఊతంగా ఉంటుంది.

మొయిత్రా కేసులో మరో మలుపు ఈ వివాదం కన్నా ఆశ్చర్యకరమైంది. లోకసభలో తన ఘాటు ప్రసంగాలవల్ల మొయిత్రా అందరి దృష్టినీ ఆకర్షిం చారు. సమర్థురాలైన పార్లమెంటేరియన్‌గా ప్రసిద్ధులయ్యారు. తృణమూల్ వాదనలను సవ్యంగా, సూటిగా, వాటంగా పార్లమెంటులో వినిపించ గలిగారు. ఇవన్నీ తృణమూల్ కాంగ్రెస్ కు ఆమోదయోగ్యమైనాయి. ఆమె సామర్థ్యం చూసి తృణమూల్ నాయకులు పొంగి పోయారు. మమతా బెనర్జీతో మొయిత్రాకు ఉన్న సాహిత్యం అపారమైంది. కానీ ఒక్కసారి మొయిత్రా వ్యాఖ్యలు వివాదా స్పదం కాగానే బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనకు సన్నిహితురాలు, సమర్థురాలు అన్న మొయిత్రాకు అండగా ఉండడానికి నిరాకరించారు. మొయిత్రా వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆమె వ్యక్తిగతమైనవి, తృణమూల్‌కు వాటితో సంబంధం లేదు అని వాటంగా తప్పించుకుంటున్నారు. ఇందులోనూ రాజకీయ దృక్పథమే కనిపిస్తోంది తప్ప హేతుబద్ధత జాడ కూడా లేదు. మహువా మొయిత్రాను వెనకేసుకొస్తే హిందువుల ఓట్లు ఎక్కడ కోల్పోతామోనన్న భయం మమతా బెనర్జీని పీడించడమే దీనికి కారణం. కానీ సత్యాసత్య వివేచన, సంవాదం, చర్చ అన్న అంశాల ప్రస్తావనే ఆమె తీసుకు రాదలచుకోలేదు. మన రాజకీయ నాయకులలో చాలా మందికి దైవ భక్తి, మత విశ్వాసాలు మెండు గానే ఉన్నాయి. అయితే అనువైనప్పుడు వాటిని సామాజికాంశాలుగా మార్చడం కాకపోతే వివాదాస్పద వ్యాఖ్యలు ఆ నాయకుల వ్యక్తిగత విశ్వాసం అని తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఏ పార్టీలో అయినా అందరి అభిప్రా యాలు, ఆలోచనలు, వ్యక్తీకరణలు మూస పోసినట్టు ఒకే రీతిలో ఉండవు. కాని ఏక సూత్రత అయినా ఉండకపోతే అది పక్షపాత దృష్టో లేక అవకాశవాదమో అవుతుంది. మహువా మొయిత్రా కాళికా దేవి మీద చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం అని సరిపెట్టుకుందామనుకున్నా వాటి ప్రభావం సమాజం మీద ఉన్నప్పుడు, అవి విస్తారమైన చర్చకు దారి తీసినప్పుడు ప్రభుత్వ అధినేతలు, పార్టీ నాయకులకు నిశ్చితాభిప్రాయం వ్యక్తం చేయవలసిన బాధ్యత ఉండకపోతే ఎలా. మతం వ్యక్తికి పరిమితమైందిగానే ఉండాలనడంలో విప్రతిపత్తి లేదు. కానీ మత సంబంధమైన అభిప్రాయాల ప్రకటన సార్వజనీనమవుతున్నప్పుడు వ్యక్తిగతం అని వాదించడం అవకాశవాదమే. మొయిత్రా వ్యాఖ్యల సంగతి పక్కన పెడ్తే ఆమె లేవనెత్తిన కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం ఎవరికైనా కష్టమే. కామాఖ్యా ఆలయానికి వెళ్లినప్పుడు అస్సాం ముఖ్యమంత్రులు దేవతకు ఏమేం అర్పిస్తారో చెప్పగలరా అని ఆమె నిలదీస్తున్నారు. దీనికి అస్సాం ముఖ్య మంత్రే కాదు మరే ముఖ్యమంత్రీ సమాధానం చెప్పలేరు. మతం వ్యక్తిగతమైం దని తప్పించుకోవడానికి మమతా బెనర్జీ లాంటి వారు ఎంత ప్రయత్నించినా భిన్న మతాల వారి ఓట్లు ఎక్కడ కోల్పోతామోనన్న చింత అన్ని పార్టీల్లోనూ ఉన్నదే. దేవతారాధన దేశమంతా ఒకేలా లేదు. ఉండడానికి అవకాశమే లేదు. అంతెందుకు పేదల దేవుళ్లకు, కలిగిన వారి లేదా కులీన దేవతలకే తేడా స్పష్టంగానే కనిపిస్తోందిగా. హిందూ మతానుయాయులు కాని గిరిజనులను హిందుత్వ పరిధిలోకి లాగడానికి బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేస్తోందో రహస్య మేమీ కాదు. పండగలు, పబ్బాలు జరుపుకునేప్పుడు వివిధ ప్రాంతాల, తెగల, అనుయాయుల మధ్య భిన్న విధానాలు వైఖరులు ఉన్నాయి. వాటిని అంగీకరించవలసిందే. వ్యక్తిగత స్థాయికి పరిమితం కావలసిన మతాన్ని రాజకీయ ప్రయోజనం కోసం సార్వజనీనం చేయడంతోనే అసలు సమస్య ఎదురైంది. మొయిత్రా లాంటి నాయకులు కూడా తమ సొంత భావనలను బహిరంగంగా వ్యక్తం చేసేటప్పుడు వాటి ప్రభావం సమాజం మీద ఎలా ఉంటుందో ఆలోచించే సంయమనం పాటించాలి. వ్యక్తిగత భావాలు జనంలోకి వస్తే అవి వ్యక్తిగతం కాకుండా పోతాయి.

## వ్యర్థ పర్వతాలను కదిలించాలి

ఐ. ప్రసాదరావు

కేంద్ర ప్రభుత్వం జులై 1వ తేదీ నుంచి ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ (యస్.యు.పి) వినియోగంపై నిషేధం విధించింది. ఐస్క్రీమ్ స్టిక్స్, థర్మోకోల్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్క్‌లు, స్పూన్‌లు, ప్యాకేజీ వంటి వస్తువులను ఒకసారి వాడిన తరవాత ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి వాడటాన్ని నిషేధం విధించింది. ఇకనైనా అందరూ గ్రహించాలి, ఆచరించాలి. మనం, భవిష్యత్తు తరాలు పర్యావరణాన్ని కాపాడడానికి ఈ నిర్ణయం మంచి ఫలితం ఇస్తుందని ఆశిద్దాం. 2019 పర్యావరణ నివేదిక ప్రకారం ప్రతీ భారతీయ పౌరుడు ఏటా సగటున 9.5 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రాలలోకి చేరవేస్తున్నాడు. దీంతో సముద్ర జీవరాశులు, పర్యావరణ పరిరక్షణ ప్రమాదం అంచున నిలబడ్డాయి. భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. తస్మాత్ జాగ్రత్త అని మనలందరిని హెచ్చరిస్తున్నాయి.

మూడు దశాబ్దాలుగా మనదేశంలో ఈ ప్లాస్టిక్ వినియోగం గ్రామ స్థాయి నుంచి పట్టణ నగర స్థాయి వరకూ ప్రతీ సమయంలో ప్రతీ వ్యక్తి జీవితంలో భాగమై పోయింది. పొద్దున్నే లేచిన దగ్గర నుంచి పడుకునే వరకు ప్రతీ ఒక్కరూ వాడే అనేక వస్తువులు ప్లాస్టిక్‌తో తయారు చేసినవే. అయితే వీటిలో రీసైకిల్ చేసేవి బహు తక్కువ. ఎక్కువ శాతం ఒకసారి వాడి పారేసేవే. భారత పర్యావరణ నివేదిక 2022 ప్రకారం మనదేశంలో రీసైకిలింగ్‌కు

పనికిరాని ప్లాస్టిక్ వ్యర్థాలు, బహు పొరల ప్యాకింగ్ సుమారు 35% శాతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. 68% శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు ఊరి చివర డంపింగ్ యార్డ్, ఖాళీ ప్రదేశాలలో "వ్యర్థ పర్వతాలు" గా మనకు దర్శనమి స్తున్నాయి. వీటిలో 12 శాతం మాత్రమే రీసైకిలింగ్‌కి పనికి వచ్చేవిగా, 20 శాతం కాలి బూడిద అవుతున్నట్లు సమాచారం. ఇక మిగిలిన వ్యర్థాల వివ రాలు సశేషం. ఎక్కడ ఎలా ఉంటున్నాయో వివరాలు లభించటం లేదు. ఇక భారతదేశంలో వాడే వివిధ ప్లాస్టిక్ వస్తువులను ఇలా పరిశీలన చేయవచ్చు.

పాలీస్టెరిన్ (పి.యస్) తో తయారైన ద్రవాల కప్పులు, భోజనానికి వాడే వస్తువులు 1 శాతం ఉండగా, అధిక మందం పాలిథిన్ (హెచ్ డి పి ఇ) తో తయారైన వస్తువులు తెచ్చుకునే సంచులు, పాల జగ్గులు వంటివి 7 శాతంగా ఉన్నాయి. పాలిథిన్ టెరాఫ్తలెట్ (పి.ఇ.టి) తో తయారు చేసే ఇంజనీరింగ్ ప్యాకింగ్స్, ఫిల్మ్, డ్రింకింగ్ ప్యాకేజీ వస్తువులు 12 శాతంగా ఉన్నాయి. పాలి ప్రొపైలిన్ (పి.పి) తో తయారైన వస్తువులు టప్పర్ వేర్, కార్ పార్ట్స్, థర్మల్ వేర్ వస్తువులు 14 శాతం ఉండగా, లో డెనిసిటీ పాలిథిన్ (ఎల్.డి.పి.ఇ) తో తయారైన వస్తువులు ప్లాస్టిక్ బ్యాగ్స్, కంటైనర్లు 31 శాతం ఉన్నాయి. ఇక 35 శాతం వస్తువులు "మల్టీ లేయర్ ప్యాకింగ్ (యమ్.ఎల్.పి) అల్యూ మినియం ఫోయల్స్ కలిగినవి. 2019 పర్యావరణ గణాంకాలు ప్రకారం ఇండియాలో 3.5 మిలియన్ల వ్యర్థాలలో కేవలం 12 శాతం వస్తువులు రీసై క్లింగ్ చేయడానికి ఉపయోగపడుతాయి అని, 20 శాతం కాల్చేయడమేనని తెలుస్తోంది. మిగిలిన 68 శాతం ప్లాస్టిక్ వినియోగానికి లెక్కలు లేవు. ఎక్కడ చూసినా ఈ భూభాగం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతోంది. ఈ ప్లాస్టిక్ అనేక అనారోగ్యాలకు కారణమవుతోంది. జంతువులు కూడా ఈ వ్యర్థాలు తినడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నాయి. పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది.

ప్రపంచంలో అతి తక్కువ స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రాలలోకి చేరవేస్తున్న దేశాల్లో నార్త్ అమెరికా, యూరప్ దేశాలు ముందు వరుసలో ఉండగా, మధ్యస్థ దేశాలుగా ఉపఖండ ప్రాంత దేశాలు ఉన్నాయి. అయితే, అతి ఎక్కువ స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రాలలోకి చేరవేస్తున్న దేశాలు మాత్రం ఆఫ్రికా, సౌత్ అమెరికా దేశాలు అని పర్యావరణ నివేదికలు చెబు తున్నాయి. ఇకనైనా అన్ని దేశాలూ ప్లాస్టిక్ వాడకంపై పలు జాగ్రత్తలు తీసు కోవాలి. పలు సూచనలు సలహాలు ఇవ్వాలి. కఠిన చట్టాలను తయారు చేసి, అమలు పరచాలి. అన్ని ప్రభుత్వాల నుంచి ప్లాస్టిక్ వస్తువులు ఉత్పత్తి, విని యోగం, వ్యర్థాలు వివరాలు సంబంధిత కేంద్ర ప్రభుత్వాలకు, అంతర్జాతీయ సంస్థలకు సమర్పించాలి. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మన భారతదేశ పౌరులకు, భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం ఆరోగ్యం అందించుటకు అందరం స్వచ్ఛందంగా ముందుకు సాగుదాం. ఈ కర్తవ్యం కూడా అత్యున్నత దేశభక్తి అని భావిద్దాం. పాటిద్దాం.

వ్యాస రచయిత సెల్ 6305682733

## ప్రియమైన మౌన భారతీయులారా..

భబని శంకర్

నిత్యం తమతోటి పౌరులపై వేధింపులను, హింసాకాండను అత్యధిక భారతీయులు చూస్తూనే ఉన్నారు. ప్రత్యేకించి ముస్లింలు, మతమైనారిటీలపై దాడులు చేస్తూ, హింసాకాండను సాగిస్తున్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికవాదం, సైన్సు, హేతువు పైన దాడులు సాగిస్తూనే ఉన్నారు. వీటిని నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటూ ఉన్నారు. భారతదేశంలో పౌరుల హక్కు లను కాలరాస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని దిగజారుస్తున్నారు. హిందుత్వ భావ జాలంతో ప్రత్యక్షంగానే విద్వేషకర ఒంటెద్దు పోకడ రాజకీయాలను విస్తరిస్తు న్నారు. ఇవి దేశ ప్రగతికి, పురోగతికి, దేశ సమైక్యతకు, సమగ్రతకు అత్యంత ప్రమాదకరమైనవి. మెజారిటీ ప్రజల మౌనమే హిందూత్వ ప్రచారకులకు అధి కారం కట్టబెట్టడానికి, వారు ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి తోడ్పడు తున్నది. పక్కన ఉండి మౌనంగా చూడటం లేదా క్రియాశీలంగా పాల్గొంటూ బహిరంగంగా లేదా మౌనంగా మద్దతిస్తూ కేరింతలు కొడుతున్నందున మనతోటి పౌరులు, సహచర ప్రజలు ముస్లింలపై మతమైనారిటీలపై దాడులు, హింసా కాండ పెరుగుతున్నాయి. ముస్లింలు, మత మైనారిటీలపై దాడులు, హింస పెరుగుతున్నప్పటికీ మెజారిటీ ప్రజలు ఎందుకు? ఎలా మౌనంగా ఉన్నారు? ఈ మౌనమే దాడులు సాగిస్తున్నవారికి ప్రోత్సాహాన్నిస్తోంది. ఈ ప్రశ్న నన్ను ఆందో ళన పరుస్తున్నది. ఎందుకంటే నేను భారతీయుడిని గనుక, అంతర్ సంస్కృతికి, మత సామరస్యతకు చిహ్నంగా ఉన్న సెక్యులర్ భారతదేశంలో పుట్టి పెరిగాను. గొప్ప దేశంలో పెరగడం గర్వంగా భావిస్తాను. అసమానతలు, దోపిడీ ఉన్నప్ప టికీ దేశంలో ప్రధాన ప్రవంతి ద్వేషాన్ని హర్షించే వారు కాదు. మెజారిటీ ప్రజలు సమాజంలో అన్ని రకాల హింసను వ్యతిరేకించేవాళ్లు, ఖండించేవాళ్లు, మీడియా ఇతర మార్గాల ద్వారా అసత్యాల ప్రచారం, క్రైస్తవులు, ముస్లింలపట్ల ద్వేషం, దిగువ కులాలు, దిగువ తరగతి ప్రజలపై వ్యతిరేకత, భారత జాతీయత పేరుతో హిందూత్వను విస్తరించడం, ప్రజాసమూహాలను హిందు మతవాదులుగా మలచడం, దేశంలో అమాయక ప్రజలపై నిత్యం హింసాత్మక దాడులు సాగించి వేధిస్తున్నారు. ఈ అన్యాయాన్ని, అకృత్యాలను సహిస్తూ మౌనంగా ఉండటానికి ద్వేషభావం, అమాయకత్వం, అధికారంతో అణచివేయడం, అధికారాన్ని చూసి భయవిహ్వాలులు కావడం, కులం-తరగతి, అవకాశ వాదం ప్రధాన కారణాలు. భారతదేశంలో మతమైనారిటీలకు వ్యతిరేకంగా హింసను సర్వసాధారణం చేయాలన్న తమ లక్ష్యసాధనకు హిందూత్వ ప్రచారకులకు శతాబ్దికి పైగా కాలం పట్టింది. హిందూత్వ ప్రభుత్వం తన సొంత భావజాలాన్ని పెంచి పోషిస్తూ,

మన మౌనమే వారి బలం. దేశంలో ముస్లింలు, మన రక్షణకోసం భయం, మౌనాన్ని విడనాడి ఐక్యం కావడానికి ఇదే సరైన సమయం. ముస్లింలను వేధిస్తే దేశ ప్రజలందరినీ హిందూత్వ శక్తులు వేధించినట్లుగా భావించాలి. భారతదేశం, దేశ ప్రజలు మనుగడకోసం హిందుత్వను ఓడించవచ్చు. తన భావజాలాన్ని, పునాదిని విస్తరించడానికి హిందూత్వం నూతన మార్గాలను అన్వేషిస్తోంది. మన శాంతిని, పురోగతిని, గౌరవాన్ని రక్షించుకోవడం దేశంలోని అన్ని జీవన రంగాలలో హిందూత్వను ఓడించడంపైనే ఆధారపడి ఉంటుంది.

భారతదేశాన్ని విధ్వంసం వైపు నడిపించడం స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలో, ప్రజల్లో వచ్చిన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక జీవన రంగాల్లో శతాబ్దికాలంగా తీసుకున్న చర్యలు, అనుసరించిన విధానాలు నీతి బాహ్యమైన హిందూత్వ నిరంకుశత్వానికి దారి తీశాయి. విషతుల్యమైన, విద్వేషభావజాలం గురించి తెలియని సామాన్య ప్రజలు, అమాయకులు, వంచనకు గురవుతున్న పౌరులు హిందూత్వ శక్తుల, వారి సంస్థల విస్తరణకు సహకరించారు.

ఇంకా అనేకమంది హిందూత్వం జాతీయతాశక్తి అని, అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిర్మించడం కోసం పని చేస్తున్నారని నమ్ముతున్నారు. హిందూత్వ ఫాసిస్టుశక్తి భారతదేశంలో ఆశ్రిత పెట్టుబడీదారీ వ్యవస్థ వృద్ధి కోసం పనిచేస్తోంది. ఈ వ్యవస్థలో కొన్ని కార్పొరేషన్లు ఆర్థిక, రాజకీయ రంగాలను తమ గుప్పిట పెట్టుకుంటాయి. హిందూత్వ సంకుచిత దృష్టి భారతదేశ సమా జాన్ని, సంస్కృతిని, మతాన్ని నియంత్రించేందుకు అన్ని జీవన రంగాలలో హిందుత్వ శక్తులు ప్రవేశించి పనిచేస్తున్నాయి. నేడు ఎన్నికల ద్వారా హింసా రాజకీయాలను అమలు చేసేందుకు బెదిరింపు ఎత్తుగడలను అనుసరించడానికి హిందూత్వ భావజాలం, హిందూత్వ శక్తులు అత్యంత శక్తివంతంగా ఉన్నాయి. మధ్యయుగాల నాటి పరిస్థితులను కల్పించేందుకు పని చేస్తున్న హిందూత్వ శక్తిని వ్యతిరేకించే వారిపైన, మతమౌనారిటీలపై బహిరంగంగా సామాజిక హింసను సాగించడమే తదుపరిదశ. మెజారిటీ ప్రజలు మౌనంగా ఉంటే అది భారతదేశానికి, దేశ ప్రజల లక్ష్యానికి ఏ మాత్రం ఉపయోగపడదు. సామాజిక సామరస్యత పైనే శాంతి, పురోభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి ఆధారపడి ఉన్నాయి. పౌర హక్కులు, ఆత్మగౌరవం, ఉద్యోగాలు, కెరియర్‌ను పరిరక్షించుకునేందుకు మౌనం ఏ మాత్రం దోహదం చేయదు.

అన్ని జాతీయ వనరులను పెట్టుబడిదారీ కార్పొరేషన్లకు కట్టబెట్టేందుకు భారతదేశ ప్రజలు సాధించిన విజయాలను వారికి అప్పగించడానికి మెజారిటీ వాద ప్రజల మౌనం ఉపకరిస్తోంది. నేడు ముస్లింలు, క్రైస్తవులు, దేశ మూల వాసులను, మానవ హక్కుల రక్షణకు పోరాడే కార్యకర్తలు, జర్నలిస్టులు, మేధావులను అనేక విధాలుగా హింసిస్తున్నా, రానున్న కాలంలో మెజారిటీ ప్రజలను సైతం హింసించవచ్చు. హిందూత్వ జ్వాలలు మనందరినీ చుట్టు ముట్టడానికి సమయం పట్టవచ్చు. మనం ప్రేమిస్తున్న దేశాన్ని ధ్వంసం చేసేం దుకు ఒక చిన్న గ్రూపు హిందూత్వ ఫాసిస్టులను సమైక్యంగా ప్రతిఘటించకపోతే మనుగడ, హక్కులు, ఆత్మగౌరవం దక్కడం కష్టమవుతుంది. మొత్తం దేశ ప్రజలతో పోలిస్తే కొద్దిమంది వ్యక్తులు, సంస్థలు, నెట్‌వర్క్‌లు మాత్రమే ఉన్నాయి. మన మౌనమే వారి బలం. దేశంలో ముస్లింలు, మన రక్షణకోసం భయం, మౌనాన్ని విడనాడి ఐక్యం కావడానికి ఇదే సరైన సమయం. ముస్లిం లను వేధిస్తే దేశ ప్రజలందరినీ హిందూత్వ శక్తులు వేధించినట్లుగా భావించాలి. భారతదేశం, దేశ ప్రజలు మనుగడకోసం హిందుత్వను ఓడించవచ్చు. తన భావజాలాన్ని, పునాదిని విస్తరించడానికి హిందూత్వం నూతన మార్గాలను అన్వేషిస్తోంది. మన శాంతిని, పురోగతిని, గౌరవాన్ని రక్షించుకోవడం దేశంలోని అన్ని జీవన రంగాలలో హిందూత్వను ఓడించడంపైనే ఆధారపడి ఉంటుంది.

వ్యాస రచయిత : యుకెలోని గ్లాస్గో యూనివర్సిటీ సంబంధితులు, ఫ్రంట్‌లైను సౌజన్యం

## చొక్కా విప్పి పారిపోయిన జ్యోతిష్కుడు

ఇ-మెయిల్

రోజూ టీవీ చానల్స్‌లో పలానా రంగురాళ్లు చేతివేళ్లకు పెట్టుకుంటే జీవితాలు బాగుపడతాయి, పలానా రుద్రాక్షలు మెడలో వేసు కుంటే ధనలక్ష్మి ఇంట్లో తాండవం చేస్తుంది, పేరు మార్చుకుంటే జీవితాలు మారతాయి అని చెప్పి మోసం చేస్తున్న ఒక జ్యోతిష్కుడి బాగోతం తాజాగా ఒక టీవి చానల్‌లో (మహా న్యూస్) బట్టబయలు అయింది. జ్యోతిష్యం పేరుతో, సంఖ్యా శాస్త్రం పేరుతో మోసం చేసే ఎం.గోపాలకృష్ణ అనే జ్యోతిష్కుడు టీవీ చానల్‌లో, తనను నమ్మి వచ్చిన మహిళలను ట్రాప్ చేసి లైంగికంగా లొంగతీసుకునేది బయటపడేటప్పటికీ చొక్కా విప్ప దీసుకొని లైవ్ కార్యక్రమం నుండి పారిపోయాడు. ఇలాంటి దొంగలకు ఇది ఒక గుణపాఠం కావాలి. ప్రజల బలహీనతలను అడ్డం పెట్టుకొని జ్యోతిష్యం పేరుతో, జాతకాల పేరుతో, వాస్తు పేరుతో, రంగురాళ్ల పేరుతో, రుద్రాక్షల పేరుతో, సంఖ్యాశాస్త్రాల పేరుతో మోసం చేసేవారి పట్ల ప్రజలు ఇప్పటి కయినా చైతన్యవంతులై, ఎక్కడికక్కడ బుద్ది చెప్పాలి. ఆ మధ్య వేణుస్వామి అనే జ్యోతిష్కుడు కూడా హేతువాదుల దెబ్బకు సమాధానం చెప్పలేక ఒక చానల్‌లో నాకు జ్యోతిష్యం రాదు, నన్ను నమ్మవద్దు అని దణ్ణంపెట్టి స్టూడియో నుండి దిగిపోయాడు. అంతకుముందు తెలంగాణలో నెహ్రూ అనే సంఖ్యాశాస్త్రజ్ఞుడు అరుణ్ అనే యువకునికి నీ పేరు మార్చుకో, ప్రతి రోజూ ఆ పేరుని రామకోటి రాసినట్లు ఇన్నిసార్లు రాసుకో, నీ జీవితం మారుతుంది అని చెప్పి రూ. 50 వేలు తీసుకున్నాడు. కాని నెహ్రూ చెప్పినట్లు వేణు జీవితంలో మార్పు రాని కారణంగా నెహ్రూ మీద కేసు వెయ్యగా అతనిని అరెస్టు చేశారు. నెహ్రూకి క్యాన్సర్ ఉంది. ఆ తర్వాత చనిపోయాడు. క్యాన్సర్ రాకుండా ఆయన తన పేరు మార్చు కోవచ్చుకదా!! అలోచించండి. ఇంకొకసారి హైదరాబాదులో జాతకాలు చెప్పుకుని బ్రతికే లక్ష్మీకాంత శర్మ అనే జ్యోతిష్కుడిని ఎవరో కిడ్నాప్ చెయ్యగా పది లక్షలు ఇచ్చి బయటపడ్డాడు. అంటే జ్యోతిష్యం చెప్పుకుని బ్రతికేవారికి వారి జ్యోతిష్యం తెలియదనేగా. ఇక దాదాపు బాబాలందరి పైనా కేసులున్నాయి. చాలామంది జైళ్లకుపోయారు. ఆశారామ్ బాపు, రాంపాల్ బాబా, దేరా బాబా లాంటివారు బెయిల్ కూడా లేకుండా మగ్గు తున్నారు. రాంపాల్ బాబా అయితే మహిళా భక్తుల టాయి లెట్లకు సీసీ కెమెరాలు అమర్చి ఆ దృశ్యాలను తన బెడ్ రూంలోని టీవీలోకి వచ్చేట్లు అమర్చుకున్నాడంటే ....బాబాల నికృష్ట నీచమైన చేష్టలు గురించి ఇంకేం చెప్పాలి? తమిళనాడులో ప్రేమానంద్ అనే బాబా పదమూడు మంది బాలికలను గర్భిణులను చేసిన కారణంగా రెండు జీవిత ఖైదుల శిక్ష పడింది. చివరికి జైల్లోనే చనిపోయాడు. మూఢంగా నమ్మడం గాకుండా హేతు బద్ధంగా ఆలోచించాలి. అప్పుడే ఇలాంటి వారి బారిన పడకుండా ఉంటాం. వారి భరతం పడతాం.

నార్నె వెంకట సుబ్బయ్య
హేతువాద సంఘం అధ్యక్షుడు

## గాలివాటు పన్ను- గ్యాస్ మంట

ఎం.కె.ఆర్

ధరలు ఎంత పెంచినా జనం ఆమోదిస్తున్నారు, ఎక్కడా నిరసన తెలపటం లేదు. విశ్లేషకులకు, జర్నలిస్టులకు ఎందుకు? ఇదీ ఇటీవల బీజేపీ నేతలు వేస్తున్న ప్రశ్నలు, చేస్తున్న ఎదురు దాడి. రెండు రోజుల క్రితం సాధారణ వంట గ్యాస్ ధరను మరో రూ.50 పెంచారు. దీంతో సిలిండరు ధర రూ.1,105కు చేరింది. అంతకుముందు ఎంత పెంచినా జనం మౌనంగా ఉన్నారు. పార్టీల పిలుపుల్లో కార్యకర్తలు తప్ప ఇతర జనాలు కనిపించరు. సర్దుకుపోవటంలో మన తరవాతే ఎవరైనా!

జులైలోనే ప్రభుత్వం విండ్ ఫాల్ టాక్సు పేరుతో చమురు సంస్థల మీద పన్ను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఇది మామూలుగా విధించే పన్నుకు అదనం, తాత్కాలికం. దాని వలన కేంద్ర ప్రభుత్వానికి లక్ష నుంచి లక్షా 30 వేల కోట్ల వరకు వస్తుందని కొందరు చెబుతుండగా ఇంకా ఎక్కువ ఉండవచ్చని కొన్ని అంచనాలున్నాయి. సరే ఎంతైనా అది సెస్ గనుక వాటిలో రాష్ట్రాలకు వచ్చేదేమీ ఉండదు. అమ్మకపు పన్ను, జిఎస్‌టి, మరొక పన్ను గురించో విన్నాం గానీ విండ్ ఫాల్ టాక్సు గురించి పెద్దగా తెలియదు. తెలుగులో గాలి వాటు (ఆదాయంపై) పన్ను అందాం. ఒక కంపెనీ దాని ప్రమేయం లేకుండా ఆర్థికంగా పెద్ద మొత్తంలో లాభాలు, లబ్ధి పొందటాన్ని విండ్ ఫాల్ అంటున్నారు. నదులకు భారీగా వరదలు వచ్చినపుడు లంకల్లో ఉన్న పొలాలకు సారవంతమైన ఒండ్రు మట్టి చేరి పంటలు బాగా పండుతాయి. కొత్తగా కొన్ని లంకలు ఏర్పడి భూమిగా అందుబాటులోకి కూడా రావచ్చు. దీనికి రైతుల ప్రమేయం లేదా ప్రయ త్నాలుగానీ ఉండవు. అలాగే పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు అలాంటి లాభాలు వస్తాయి. ఉక్రెయిన్ వివాద ఫలితంగా మన దేశంలోని చమురు కంపెనీలకు అలాంటి అపరిమిత లాభాలు వస్తున్నందున వాటి మీద కేంద్ర ప్రభుత్వం పన్ను విధించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు గాలివాటు పన్ను ఇలా ఉంది. మన దేశం నుంచి ఎగుమతి చేసే పెట్రోలుకు రూ.6, డీసెలు మీద రూ.13, విమాన ఇంధనానికి లీటరుకు ఒక రూపాయి, దేశీయంగా ఉత్పత్తి చేసిన ముడి చమురు మీద టన్నుకు రూ. 23,250 లు చెల్లించాల్సి ఉంటుంది.

మన దేశంలో ఈ పన్ను ఎందుకు విధించారు. ఆ వచ్చిన రాబడితో వంట గ్యాస్, పెట్రోలు, డీసెలు ధరలను తగ్గించాల్సి ఉండగా గ్యాస్ ధరను రూ.50 ఎందుకు పెంచినట్లు? ఎవరి కోసం ఈ పన్ను ఆదాయాన్ని ఖర్చు చేస్తారు? ప్రశ్నించకుండా నోరు మూసుకున్న వారు దేశభక్తులు, అడిగినవారు దేశ ద్రోహులా! దేశంలో కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో వంటగ్యాస్‌ను ప్రోత్సహిం చారు. ప్రజల కొనుగోలు శక్తి తక్కువగా ఉన్నందున దానికిగాను సబ్సిడీలు కూడా ఇచ్చారు. దీంతో వినియోగదారులు గణనీయంగా పెరిగారు. కరోనా లాక్‌డౌన్ విధించిన 2020లో పెట్రోలు కంటే దేశంలో తొలిసారిగా గ్యాస్‌ను ఎక్కువగా కొనుగోలు చేశారు. తరవాత తిరిగి పెట్రోలు పెరిగింది. సబ్సిడీలను

ఎత్తివేసేందుకుగాను వేసిన ఎత్తుగడ ఏమంటే సబ్సిడీ మొత్తాన్ని నేరుగా విని యోగదారుల ఖాతాలో వేస్తామంటూ గ్యాస్ ధర మొత్తాన్ని ముందుగా చెల్లించే అలవాటు చేశారు. తరవాత స్వచ్ఛందంగా సబ్సిడీ వదులు కోవాలన్న తతంగం నడిపారు. బీజేపీ దేశ భక్తులు కూడా వదులుకోకపోవటంతో క్రమంగా సబ్సిడీ ఎత్తివేశారు. ఐదుశాతం మంది స్వచ్ఛందంగా వదులు కున్నట్లు చెప్పగా కాగ్ సదరు అంకెలతో అంగీకరించలేదు. 2014లో గ్యాస్ ధర రూ.414 కాగా తాజా పెంపుదలతో అది రూ.1,105 కు పెరిగింది. నిజానికి 2014 తరవాత అంత ర్జాతీయ మార్కెట్లో గ్యాస్ ధర ముడి చమురుతో పాటు గణనీయంగా తగ్గింది.

అబ్జర్వర్ రిసర్చ్ ఫౌండేషన్ (ఒఆర్ఎఫ్) 2021 డిసెంబరు నాలుగవ తేదీన ప్రచురించిన విశ్లేషణలో పేర్కొన్న అంశాల సారాంశం ఇలా ఉంది. 2013-14 నుంచి 2019-20 కాలంలో అంతర్జాతీయ ఎల్‌పిజి (వంట గ్యాస్) ధర 48 శాతం తగ్గింది. అదే 2020-21తో పోల్చితే తగ్గుదల 31శాతం ఉంది. 2014 ఏప్రిల్ నుంచి 2021 అక్టోబరు వరకు మన దేశంలో ధరను 110 శాతం పెంచారు. కరోనా లాక్‌డౌన్ల ఎత్తివేత తరవాత మాత్రమే అంతర్జాతీయ ధర పెరిగింది. అంతకు ముందు ఆరు సంవత్సరాలు తగ్గింది. ఈ కారణంగానే ప్రభుత్వం మీద సబ్సిడీ భారం తగ్గింది. 2013-14 నుంచి 2015-16 మధ్య ప్రభుత్వం భరించిన సబ్సిడీ భారం 64 శాతం తగ్గింది. అంకెల్లో 746.1 నుంచి 263 బిలియన్ల రూపాయలకు (మన కోట్లలో చెప్పుకుంటే 74,610 నుంచి 26,300 కోట్లకు) తగ్గింది. ఇదే కాలంలో చమురు కంపెనీలు భరించిన సబ్సిడీ మొత్తం 98 శాతం అంటే రూ.69,128 నుంచి రూ.1,268 కోట్లకు తగ్గింది. వినియోగదారులకు నేరుగా చెల్లించిన సబ్సిడీ మొత్తం 2015-16 నుంచి 2020-21 కాలంలో రూ.27,570 కోట్ల నుంచి రూ.3,658 కోట్లకు తగ్గింది.

ధనికులకు సబ్సిడీని తగ్గించి పేదలకు పెంచామంటూ ప్రచార ఆర్భాటం చేసి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) పథకం పేరుతో మంజూరు చేసిన గ్యాస్ కనెక్షన్ల ప్రచారాన్ని అనేక మంది ప్రశ్నించారు. సబ్సిడీల గురించి అనుస రించిన లెక్కల పద్దతిని కాగ్ ప్రశ్నించింది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఓటర్ల కోసం ఈ పథకాన్ని ప్రారంభించారు. 2015-16 లో ఈ పథకం కింద ఇచ్చి నట్లు చెప్పిన సబ్సిడీ రూ.2,990 కోట్లు కాగా 2019-20 కి అది రూ.1,293 కోట్లకు తగ్గింది. ఈ పథకం కింద గ్యాస్ కనెక్షన్లు పొందిన వారి ఆదాయం పెరగని కారణంగా, సబ్సిడీ కోత వలన సిలిండరును తీసుకోలేకపోయారు.

పిఎంయువై పథకం కింద గ్యాస్ కనెక్షను ఉన్నవారికి సిలిండర్‌కు రూ.200 సబ్సిడీ ఇస్తున్నట్లు ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఈ ఏడాది మే 12 వ తేదీన హిందూ పత్రిక వార్తలో వెల్లడించిన సమాచారం ప్రకారం గత ఆర్థిక సంవ త్సరంలో 90 లక్షల మంది ఉజ్వల లబ్ధిదార్లు గ్యాస్‌ను తీసుకోలేదు. కోటి మంది ఒక సిలిండరు మాత్రమే తీసుకున్నారు. 2016 మే ఒకటవ తేదీన ఉత్తర ప్రదేశ్‌లోని బలియాలో ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. 2020 మార్చి నాటికి ఎనిమిది కోట్ల కనెక్షన్లు ఇవ్వాలని చెప్పారు, తరవాత మరొక కోటి పెంచారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా గత ఆర్థిక సంవత్సరంలో (2021 మార్చి నాటికి) ఇచ్చిన కనెక్షన్లలో ఐఓసిలో ఒకసారి మాత్రమే సిలిండర్లు తీసుకున్నవారు 65, హెచ్‌పిసిలో 9.1, బిపిసిలో 15.96 లక్షల మంది ఉన్నారు. 2019 సెప్టెంబరు వరకు తాము ఇచ్చిన కనెక్షన్ల గురించి బిపిసి ప్రత్యేకంగా పేర్కొన్నది. ఐఓసిలో ఒకసారి మాత్రమే తీసుకున్న వారు 52, హెచ్‌పిసిలో 27.58, బిపిసిలో 28.56 లక్షల మంది ఉన్నారు. ఈ ఏడాది మార్చి నెలలో లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో ఏటా ఈ పథకం కింద కనెక్షన్ పొందిన వారు సగటున ఒక్కొక్కరు 3.6 సిలిండర్లు మాత్రమే తీసుకున్నారు. 2020 ఏప్రిల్ ఒకటి నుంచి డిసెంబరు వరకు కేంద్ర ప్రభుత్వం మూడు ఉచిత సిలిండర్లు ఇస్తున్నట్లు ప్రకటించగా ఈ పథకంలో తీసు కున్న సిలిండర్ల సంఖ్య 14.17 కోట్లని మరొక ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం తెలిపిందని హిందూ పత్రిక పేర్కొన్నది. తొమ్మిది కోట్ల మంది మూడు చొప్పున తీసుకుంటే 27 కోట్లు కావాలి, అంటే కరోనాలో కూడా ఉచితంగా ఇచ్చినా తీసు కొనే స్థితి లేదన్నది స్పష్టం. అలాంటపుడు కేవలం రెండు వందల సబ్సిడీ ఇచ్చి తాజాగా పెంచిన రేటు ప్రకారం రూ.900 పెట్టి కొనుగోలు చేసేందుకు ఎందరు ముందుకు వస్తారన్నది ప్రశ్న. వంట గ్యాస్ ధరలకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం సగటున లీటరు ధర జులై నాలుగవ తేదీ నాటికి 80 సెంట్లు ఉంది. మన కరెన్సీలో రూ.63.39 కాగా మన దేశంలో 87 సెంట్లు, రూ.68.94 ఉంది. మనకంటే ఆస్ట్రేలియాతో సహా 28 దేశాలలో ధర తక్కు వగా, 22 చోట్ల ఎక్కువగా ఉంది. విశ్వగురువుగా అభిమానుల నుంచి అభినంద నలు అందుకుంటున్న ప్రధాని మోదీ ఏ దేశాలను ఆదర్శంగా తీసుకుంటారు?

# ‘మోదీ వర్సెస్ కాంగ్రెస్’ వద్దు

**‘స్థానిక’ నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రచారం**

**గుజరాత్ ఎన్నికలపై కాంగ్రెస్ నిర్ణయం**

**అహ్మదాబాద్:** గుజరాత్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు తమకు, ఆ రాష్ట్రానికి చెందిన ప్రధాని నరేంద్ర మోదీకి మధ్య పోరుగా మారకూడదని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కాషాయ పార్టీకి రాష్ట్రస్థాయిలో బలమైన నాయకుడు లేడని భావిస్తున్నందున అధికార బీజేపీ స్థానిక నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించకూడదనే సంప్రదాయానికి కట్టుబడి ఉండాలని ప్రతిపక్ష పార్టీ నిర్ణయం తీసుకుంది. గుజరాత్‌లోని 182 మంది సభ్యుల సభకు ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగినప్పుడు 24 ఏళ్లకు పైగా ఉన్న అధికార వ్యతిరేకతను ఓడించడం బీజేపీకి కష్టమైన పని. ప్రియాంకగాంధీ వాద్రా సహా కొంతమంది అగ్రనేతలతో కూడిన కాంగ్రెస్ టాస్క్‌ఫోర్స్ రాబోయే ఎన్నికల కోసం వ్యూహాన్ని రూపొందించడానికి గుజరాత్‌లోని నాయకులతో ఈ వారం ప్రారంభంలో దిల్లీలో సమావేశం నిర్వహించింది. పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌లో సీనియర్ నేతలు పి.చిదంబరం, ముకుల్ వాస్నిక్, కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సూర్జేవాలా తదితరులు ఉన్నారు. గుజరాత్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రఘు శర్మ, పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జగదీశ్ ఠాకూర్, ప్రతిపక్ష నాయకుడు సుఖ్‌రామ్ రథ్వా, ఇద్దరు గుజరాత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అర్జున్ మొద్వాడియా, అమిత్ చావ్డా, అధికార ప్రతినిధి మనీశ్ సమావేశంలో పాల్గొన్నారు. ‘దిల్లీలో గుజరాత్ కాంగ్రెస్ నేతలతో టాస్క్‌ఫోర్స్ సమావేశం సందర్భంగా రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఎలా వెళ్లాలనే దానిపై వివరణాత్మక వ్యూహం సిద్ధమైంది’ అని మనీశ్ తెలిపారు. గుజరాత్ ఎన్నికలు కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు లేదా ప్రధానిని ఎన్నుకోవడానికి ఉద్దేశించినవి కానందున ఈ ఎన్నికలు మోదీ, కాంగ్రెస్ మధ్య పోరుగా మారకూడదని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ‘ఎన్నికలు గుజరాత్ కోసం, మా పోరాటం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సీఆర్ పాటిల్‌పై’ అని వివరించాయి. ‘బీజేపీకి పీఎం మోదీ ట్రంప్ కార్డ్‌గా భావిస్తూ ఆయన పేరుతో ఓట్లు కోరాలని చూస్తారు. వారికి రాష్ట్రస్థాయిలో బలమైన నాయకుడెవరూ లేరు. అందువల్ల ఎన్నికలను మోదీ వర్సెస్ కాంగ్రెస్ పోరుగా మార్చేందుకు ప్రయత్నిస్తారు. కానీ మోదీ మాత్రం వెళ్లడం లేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండేందుకు.. ప్రజలు బీజేపీ ముఖ్యమంత్రుల దుష్పరిపాలనను చూశారు. కాంగ్రెస్ పోరాటం వారికి వ్యతిరేకంగా ఉంది’ అని పార్టీ వర్గాలు తెలిపాయి. 2007 గుజరాత్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న మోదీపై విమర్శల దాడి చేశారు. రాష్ట్రంలో 2002 గోధ్రా అనంతర మత అల్లర్లకు ఆయనే కారణమని ఆరోపిస్తూ ‘మౌత్ కా సౌదాగర్’ (మరణాల వ్యాపారి) అని పిలిచారు. మోదీ ప్రధాని అయిన తర్వాత కూడా గుజరాత్ ఎన్నికల ప్రచారంలో పాత పార్టీ ఆయనపై విమర్శలు చేస్తూనే ఉంది. కాగా స్థానిక సమస్యల చుట్టూనే పార్టీ ఎన్నికల ప్రచారం సాగాలని సమావేశంలో నిర్ణయించినట్లు మనీశ్ దోషి తెలిపారు. ‘బీజేపీ చేసిన వాగ్దానం ఏమిటి.. ఇన్ని సంవత్సరాల పాలన తర్వాత వాస్తవికత ఏమిటి. విద్య, ఆరోగ్యం, కోవిడ్-19 సంక్షోభాన్ని ప్రభుత్వం పరిష్కరించిన విధానం, రైతుల సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం స్థితి ప్రధానంగా ప్రచారంలో లేవనెత్తుతాం’ అని ఆయన తెలిపారు. దిల్లీలో జరిగిన సమావేశానికి హాజరయిన తర్వాత గుజరాత్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రఘు శర్మ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎవరూ ప్రకటించకూడదని పార్టీ నిర్ణయించినట్లు చెప్పారు. పార్టీ జాతీయ అధికార ప్రతినిధి శక్తిసింగ్ గోయెల్ మాట్లాడుతూ ‘పార్టీ సంప్రదాయం ప్రకారం, మాకు మెజారిటీ వచ్చిన తర్వాత, ఎమ్మెల్యేలు సమావేశమై ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయిస్తారు. మేము ఆ సంప్రదాయాన్ని అనుసరిస్తాం’ అని స్పష్టం చేశారు. గుజరాత్‌లో గత రెండు దశాబ్దాలుగా జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించలేదు. దోషి మాట్లాడుతూ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సిద్ధం చేసే విషయానికొస్తే, అజెండాను ఖరారు చేసే ముందు పార్టీ ప్రజల నుంచి సలహాలను ఆహ్వానించాలని, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. గుజరాత్‌లో 1998 నుంచి బీజేపీ అధికారంలో ఉండగా, 1995 నుంచి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించలేకపోయింది. 2017 ఎన్నికల్లో కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకోగా, బీజేపీ 99 సీట్లు గెలుచుకుంది. ప్రజలు బీజేపీ పట్ల అసంతృప్తితో ఉన్నారని, ఈ అసంతృప్తి తదుపరి ఎన్నికల్లో ప్రతిబింబిస్తుందని కాంగ్రెస్ అభిప్రాయపడింది.

## హీరో విక్రమ్‌కు అస్వస్థత



**చెన్నై:** తమిళ స్టార్ హీరో విక్రమ్ అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఉన్నట్టుండి కుప్పకూలిపోయారు. వెనువెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆయనను చెన్నైలోని కావేరీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన కావేరీ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. కంగారు పడాల్సిన అవసరం ఏమీ లేదని కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. విక్రమ్ ఆరోగ్యంగా తిరిగి రావాలంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం ఆయన ‘కోబ్రా’, మణిరత్నం దర్శకత్వంలో ‘పొన్నియిన్ సెల్వన్’ చిత్రాల్లో నటిస్తున్నారు. పొన్నియన్ సెల్వన్ సినిమాకు సంబంధించిన టీజర్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం చెన్నైలో జరగనుంది. ఈ కార్యక్రమానికి విక్రమ్ కూడా హాజరు కావాల్సి ఉంది. ఈ క్రమంలో విక్రమ్ అస్వస్థతకు గురయ్యారు.

## 700 మంది ఉద్యోగులకు ఓలా వేటు?

**న్యూదిల్లీ:** దేశంలో క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఓలా కంపెనీ ఉద్యోగులను సాగనంపేందుకు సిద్ధమవుతోంది. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 700 మంది ఉద్యోగులను తొలగించేందుకు నిర్ణయించింది. ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు వ్యాపార కార్యకలాపాలను ఓ గాడిన పెట్టాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా విభాగాల అధిపతులకు లే ఆఫ్ వేయాల్సిన ఉద్యోగుల జాబితాను తయారు చేయాల్సిందిగా ఓలా సూచించినట్లు తెలుస్తోంది. ఓలా ఎలక్ట్రిక్ విభాగం ద్వారా ఇప్పటికే టూ వీలర్, కార్ల వ్యాపారంపై దృష్టి సారించింది. మరోవైపు గత నెలలో పాతకార్ల విభాగం ‘ఓలా కార్స్’ను, క్విక్ కామర్స్ బిజినెస్ ‘ఓలా డ్యాష్’ను మూసివేసింది. వీటితో పాటు లాభదాయకత లేదన్న కారణంతో ఓలా కేఫ్, ఫుడ్ పాండా, ఓలా ఫుడ్స్‌ను కూడా ఇప్పటికే మూసివేసింది. కేవలం ఓలా ఎలక్ట్రిక్ వ్యాపారంపై ప్రధానంగా దృష్టి సారించాలని కంపెనీ భావిస్తోంది. ఇందులో భాగంగా మూసివేసిన వ్యాపారాలకు సంబంధించిన ఉద్యోగులను తొలగించేందుకు తాజాగా ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనిపై కంపెనీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## నిజమైన శివసేన మాదే: షిండే

**ముంబై:** శివసేన పార్టీపై ఆధిపత్యం కోసం అటు మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే వర్గం.. ఇటు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే పెద్ద సంఖ్యలో శివసేన ఎమ్మెల్యేలు షిండేకు మద్దతు ప్రకటించడంతో ఆయన మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్నారు. ఈ మద్దతు ఇంకా పెరుగుతోందంటూ తాజాగా ఆయన కొన్ని చిత్రాలను షేర్ చేశారు. ‘మాజీ కార్పొరేటర్లతో సహా థానే, కల్యాణ్-డొంబివాలీ, నవీ ముంబై శివసైనికులు నన్ను కలుసుకున్నారు. పార్టీ వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ ఠాక్రే, ఆనంద్ దిఘే అనుసరించిన హిందూ అనుకూల భావజాలానికి మద్దతు ప్రకటించారు’ అంటూ ట్విటర్ వేదికగా పలు చిత్రాలు షేర్ చేశారు. గురువారం ఠాణే మున్సిపల్ కార్పొరేషన్‌కి చెందిన 66 మంది శివసేన కార్పొరేటర్లు షిండే వర్గం వైపు చేరారు. మొత్తం 67 మంది కార్పొరేటర్లలో ఒక్కరే ఉద్ధవ్ పక్షాన ఉన్నట్లు తెలుస్తోంది. బీఎంసీ (బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్) తర్వాత అతి కీలకమైన మున్సిపల్ కార్పొరేషన్ థానేనే కావడంతో ఉద్ధవ్ వర్గం అక్కడ పట్టు కోల్పోతున్నట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలాఉంటే 2017లో శివసేన తరఫున థానే మున్సిపల్ కార్పొరేటర్లుగా ఎన్నికైన వీరి పదవీకాలం ఇప్పటికే ముగిసింది. ఉద్ధవ్‌ఠాక్రే నేతృత్వంలోని శివసేనపై తిరుగుబాటు చేసిన ఏక్‌నాథ్ షిండే వర్గం.. బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. శివసేనకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు షిండేకు తోడుగా నిలవడంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ తమదే అసలైన శివసేన అంటూ రెండు వర్గాలు పేర్కొనడం గమనార్హం. పార్టీ గుర్తు తమదేనంటూ ప్రకటించుకుంటున్నాయి. ఇక పార్టీకి ప్రస్తుతం లోక్‌సభలో 18 మంది ఉండగా.. అందులో 12 మంది తమవైపే ఉన్నట్లు శివసేన రెబల్ ఎమ్మెల్యే గులాబ్‌రావ్ పాటిల్ చెప్పారు.

## స్వరాష్ట్రానికి ద్రౌపది ముర్ము

**నవీన్ పట్నాయక్‌తో చర్చలు-మద్దతిస్తామన్న ముఖ్యమంత్రి**

**భువనేశ్వర్:** ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ము శుక్రవారం స్వరాష్ట్రం ఒడిశాకు చేరుకున్నారు. ఆమె తన అభ్యర్థిత్వం విషయమై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో భేటీఅయ్యారు. తనకు మద్దతివ్వాలని కోరారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆమెకు మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో సుడిగాలి పర్యటన చేస్తున్న ముర్ము తన అభ్యర్థిత్వానికి మద్దతిచ్చేవారిని కూడగట్టుకునే పనిలో ఉన్నారు. ఇదే క్రమంలో ఒడిశాకు వచ్చారు. రాజధాని భువనేశ్వర్‌లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె విమానాశ్రయం నుంచి బయటకు వచ్చే సమయంలో అక్కడ సంప్రదాయ నృత్యాలు, డప్పులు-మేళతాళాలతో లయబద్ధమైన ప్రదర్శనలతో కోలాహలంగా ఉంది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆమెకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర అతిథిగృహం వద్ద బారులు తీరారు. ముర్ము రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టక ముందు ఆమె ఒడిశా మంత్రిగా పనిచేశారు. ముర్ము ఎమ్మెల్యేలు, ఎంపీలను ఉద్దేశించి మాట్లాడుతూ ‘సీఎం చేతికి రాఖీ కట్టాను. ఆయన విదేశాల్లో ఉన్నప్పుడూ నాతో మాట్లాడేవారు. నేను గ్రామీణ మహిళను. మంత్రిగా చాలా కష్టపడ్డాను’ అని చెప్పారు. రాష్ట్రపతిగా ముర్మును ప్రధాని మోదీ ఎంపిక చేయడం సరైనది. ఆమె గిరిజన మహిళ. ఆమె అభ్యర్థిత్వంపై దేశంలోని అందరూ ఉత్కంఠగా ఉన్నారు’ అని భువనేశ్వర్ ఎంపీ అపరాజితా సారంగి అన్నారు.

## నదిలో కొట్టుకుపోయిన కారు.. 9 మంది జలసమాధి

**డెహ్రాడూన్:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఉత్తరాఖండ్‌లో వర్షాల కారణంగా రామ్‌నగర్‌లో దెల్హా నది పొంగిపొర్లడంతో కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో తొమ్మిదిమంది జలసమాధి అయ్యారు. ఇందులో నాలుగు మృతదేహాలను వెలికి తీశారని అధికారులు తెలియజేశారు. ఒక బాలికను రక్షించినట్లు చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మృతులంతా పంజాబ్‌లోని పాటియాలకు చెందినవారు. ఉత్తరాఖండ్ పర్యటనకు వచ్చిన వారంతా తిరిగి స్వరాష్ట్రానికి వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో పాటు మహారాష్ట్ర, గోవా, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకశ్మీర్ తదితర రాష్ట్రాల్లో రుతుపవనాల ప్రభావం కనిపిస్తోంది. గోవా ప్రభుత్వం రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరు బయటకు రావొవద్దని సూచించింది. పాఠశాలలకు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. కొండచరియలు విరిగిపడొచ్చనే సూచనలతో హిమాచల్ ప్రదేశ్‌లోని మశోబరా ప్రాంతంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో మొత్తం బురదమయంగా మారిపోయింది.

## తమిళనాడు మాజీమంత్రి ఇళ్లలో సోదాలు

**చెన్నై:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తమిళనాడు మాజీ మంత్రి, ఏఐఏడీఎంకే నేత ఆర్.కామరాజ్‌కు, ఆయన సన్నిహితులకు చెందిన 49 చోట్ల విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసులో కామరాజ్‌ను, మరో ఐదుగురిని నిందితులుగా పేర్కొన్నారు. కామరాజ్ 2015-2021 మధ్య కాలంలో ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రిగా పని చేశారు. ఆ కాలంలో ఆయన తన ఆదాయానికి మించి రూ.58 కోట్లు సంపాదించారని ఏసీబీ ఆరోపించింది. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ నిఘా నీడలోకి వచ్చిన ఏఐఏడీఎంకే మాజీ మంత్రుల్లో కామరాజు ఏడోవారు. ఇదంతా రాజకీయ కక్ష సాధింపు అని ఏఐఏడీఎంకే ఆరోపించింది.

## గోవధ వద్దు: ఎంపీ బద్రుద్దీన్

**గువహతి(అసోం):** అసోం ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధినేత, ఎంపీ మౌలానా బద్రుద్దీన్ అజ్మల్ శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందువులు తమ పూర్వీకులని, గోవధ చేయవద్దని అసోంకు చెందిన బద్రుద్దీన్ అజ్మల్ కోరారు. అదే సందర్భంలో ఈద్-ఉల్-అదా రోజున ‘ఖుర్బానీ’ చేయడం ముస్లింల విధి అని బద్రుద్దీన్ అజ్మల్ పేర్కొన్నారు. అసోం పశువుల సంరక్షణ చట్టం 2021ని గౌరవించాలని బద్రుద్దీన్ అజ్మల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎంపీ అయిన మౌలానా బద్రుద్దీన్ అజ్మల్ అసోం స్టేట్ జమియత్ ఉలమా అధ్యక్షుడిగా ఉన్నారు. హిందువుల మనోభావాలను గౌరవిస్తూ ఈ వారం ఈద్-ఉల్-అదా సందర్భంగా ఆవులను బలి ఇవ్వవద్దని అసోం ముస్లింలకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని అజ్మల్ పునరుద్ఘాటించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హిందూ రాజ్‌ని చేయడానికి ప్రయత్నించడం ద్వారా హిందుస్థాన్‌ను అంతం చేయాలనుకుంటోందని, హిందూ రాజ్ ఆర్ఎస్ఎస్ వారి కలలో కూడా వాస్తవం కాలేదని, ఆర్ఎస్ఎస్ ఈ దేశంలో ముస్లింలు, హిందువుల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయలేదని ఎంపీ అజ్మల్ చెప్పారు. ‘మీరు ఈద్ రోజున ఆవులను తినకండి. మేం పండుగను హిందూ భాయ్‌లతో జరుపుకుంటాం. మా పూర్వీకులందరూ హిందువులు. వారు ఇస్లాంలోకి వచ్చారు. ఇతర మతాల మనోభావాలను గౌరవించడమే మా అభిమతం’ అని అజ్మల్ గువహతిలో విలేకరులతో అన్నారు. దేశంలోని చాలా మంది నివాసులు సనాతన ధర్మాన్ని పాటిస్తారని, ఆవును పవిత్ర జంతువుగా పరిగణిస్తుంటారని ఎంపీ చెప్పారు. హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు నివాసమున్న ప్రాంతాల్లో గొడ్డు మాంసం లేదా దాని ఉత్పత్తుల అమ్మకాలను నిషేధిస్తూ గతేడాది ఆమోదించిన అసోం పశుసంరక్షణ చట్టం 2021ని గౌరవించాలని ఆయన ప్రజలను కోరారు.

మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ మాజీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ చేసిన వ్యాఖ్యలపై ముస్లింలు ప్రతిస్పందించకూడదని, దీనికి బదులుగా నూపుర్ శర్మ వంటి వారికి దేవుడు బుద్ధి ఇవ్వాలని ప్రార్థించాలని, శిరచ్ఛేదం చేయడం మూర్ఖత్వమని అజ్మల్ వివరించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు ఓటు వేయవచ్చన్న వార్తలను ఎంపీ ఖండించారు.

## విద్వేష ట్వీట్...బీజేపీ నేతపై వేటు

**న్యూదిల్లీ:** బీజేపీ హరియాణా ఐటీ సెల్ ఇన్‌చార్జి అరుణ్ యాదవ్‌ను ఆ పార్టీ బహిష్కరించింది. ఐదేళ్ల క్రితం ఆయన ఇస్లాం, ప్రవక్త మహమ్మద్‌లపై వివాదాస్పద ట్వీట్ చేశారని, ఆయనను అరెస్టు చేయాలన్న డిమాండ్లు పెరగడంతో ఈ చర్య తీసుకుంది. అయితే ఆయనను బహిష్కరించడానికి కారణాలేమిటో బీజేపీ ప్రకటించలేదు. హరియాణా బీజేపీ కార్యదర్శి గుల్షన్ భాటియా విడుదల చేసిన ప్రకటనలో అరుణ్ యాదవ్‌ను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఓపీ ధన్‌కర్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. యాదవ్ 2017లో ఇచ్చిన ట్వీట్ వైరల్ అయింది. ఆయనపై ఫిర్యాదులేవీ దాఖలు కాలేదు. కానీ ఆయనను అరెస్టు చేయాలని సామాజిక మాధ్యమాల్లో డిమాండ్లు విపరీతంగా పెరుగుతున్నాయి. దాదాపు 1.3 లక్షల ట్వీట్లతో ట్విటర్‌లో ట్రెండింగ్‌లో ఉంది. యువజన కాంగ్రెస్ నేత బీవీ శ్రీనివాస్ ఇచ్చిన ట్వీట్‌లో బీజేపీ మరొక చిల్లర వ్యక్తిని పార్టీ నుంచి బహిష్కరించిందన్నారు. ఇటువంటి కంటి తుడుపు చర్యలు కాకుండా విద్వేషాన్ని ప్రోత్సహించేవారిని అరెస్టు చేయాలన్నారు. టిప్పు సుల్తాన్ పార్టీ అధ్యక్షుడు షేక్ సాదిక్ ఇచ్చిన ట్వీట్‌లో 2018లో ఇచ్చిన ట్వీట్‌పై ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు జుబేర్‌ను అరెస్టు చేసినపుడు, అరుణ్ యాదవ్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని దిల్లీ, హరియాణా పోలీసులను ప్రశ్నించారు.

## మధ్యంతర ఎన్నికలు పెట్టాల్సిందే: ఉద్ధవ్

**ముంబై:** మహారాష్ట్రలో మధ్యంతర ఎన్నికలు నిర్వహించాల్సిందేనని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు. తమ పార్టీ నుంచి తిరుగుబాటు చేసిన ఏక్‌నాథ్ షిండే సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉద్ధవ్ తొలిసారి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. శివసేన ఎన్నికల గుర్తు విల్లు, బాణం తమదేనని.. రెబల్ ఎమ్మెల్యేలను ఆ గుర్తును వాడుకోవడానికి వీల్లేదన్నారు. ఈనెల 11న 16మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇవ్వబోయే తీర్పు ఒక్క శివసేనే కాకుండా భారత ప్రజాస్వామ్య భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని ఠాక్రే వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు నిర్వహించి.. తన సారథ్యంలోని మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని పడగొట్టడంపై ప్రజల వైఖరేంటో తెలిపేందుకు వారికి అవకాశమివ్వాలన్నారు. శివసేన ఎన్నికల గుర్తు తమదేనంటూ సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గం ఘంటాపథంగా చెబుతుండటంపై నెలకొన్న వివాదం నేపథ్యంలో ఉద్ధవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కొందరు రాజ్యాంగ నిపుణులతో చర్చించానని.. శాసనసభాపక్షంలో చీలికలు ఏర్పడినప్పుడు అసలు పార్టీ అలాగే ఉంటుందని.. ఏమీ కాదన్నారు. లెజిస్లేచర్ పార్టీ వేరు.. అసలు పార్టీ వేరన్నారు. అందువల్ల ఎన్నికల గుర్తు విషయంలో తమకు ఎలాంటి గందరగోళం లేదని తెలిపారు. ఎంపీలతో సంప్రదించిన తర్వాత రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై నిర్ణయం ప్రకటిస్తామని ఠాక్రే అన్నారు. బీజేపీ తనను, తన కుటుంబాన్ని రెండున్నరేళ్లుగా టార్గెట్ చేసినప్పుడు తిరుగుబాటు నేతలంతా మౌనంగా ఉన్నారంటూ మండిపడ్డారు. బీజేపీతో టచ్‌లో ఉంటూ ఇలా సొంత పార్టీకి ద్రోహం చేశారంటూ షిండే పేరును ప్రస్తావించకుండా పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

## లాలూను పరామర్శించిన రాహుల్

**న్యూదిల్లీ:** ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్(74)ను దిల్లీ ఎయిమ్స్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. కింద పడిపోయి తీవ్రంగా గాయపడిన బీహార్ మాజీ ముఖ్యమంత్రిని బుధవారం ఎయిర్ అంబులెన్స్‌లో దిల్లీకి తరలించారు.

ఆయన వెంట వైద్యుల బృందం, పెద్ద కుమార్తె మీసా భారతి, రాజ్యసభ ఎంపీ ఉన్నారు. లాలూ భార్య రబ్రీదేవి, చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ దిల్లీకి చేరుకున్నారు. లాలూ ప్రసాద్ ఆరోగ్యం మెరుగ్గా ఉందని, ఆయన లేచి కూర్చోగలుగుతున్నారని, మద్దతుతో నిలబడుతున్నారని మీసా భారతి ట్వీట్ చేశారు. మూత్రపిండాల మార్పిడి కోసం సింగపూర్‌కు తీసుకు వెళ్లే విషయమై తేజస్వి యాదవ్ స్పందించారు. జార్ఖండ్ హైకోర్టు నుంచి విదేశీ పర్యటనకు అనుమతి వచ్చి, రెండు లేక నాలుగు వారాల్లో ఆయన ప్రయాణించగలరని వైద్యులు చెబితే సింగపూర్‌కు తీసుకు వెళతామన్నారు.

## కొత్తగా 18,815 కరోనా కేసులు

**న్యూదిల్లీ:** దేశవ్యాప్తంగా రోజువారీ కరోనా కేసుల సంఖ్య పెరుగుతోంది. భారత్‌లో కొత్తగా 18,815 కరోనా కేసులు నమోదు కాగా, 38 మరణాలు సంభవించాయి. కరోనా నుంచి మరో 15,899 మంది బాధితులు కోలుకున్నారు. దేశంలో ప్రస్తుతం 1,22,335 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా పాజిటివిటీ రేటు 4.96 శాతానికి పెరిగింది. దేశంలో ఇప్పటివరకు 198.51 కోట్ల కోవిడ్ టీకాల పంపిణీ జరిగింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగ్గురిపై సీబీఐ కేసు

**న్యూదిల్లీ:** 2009-17లో ఎన్ఎస్ఈ ఉద్యోగులపై అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలపై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) మాజీ మేనేజింగ్ డైరెక్టర్లు రవి నరైన్, చిత్రా రామకృష్ణతో పాటు రిటైర్డ్ ఐపీఎస్ సంజయ్ పాండేపై సీబీఐ కేసు నమోదు చేసింది. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న నిందితుల ఆస్తులను సోదా చేసినట్లు వెల్లడించింది.

ముంబై మాజీ పోలీసు కమిషనర్ సంజయ్ పాండేకు దేశంలోని అనేక ప్రాంతాల్లో గల ఆస్తులను తనిఖీ చేసినట్లు తెలిపింది. ఎనిమిది చోట్ల (ముంబై, పూనే, దిల్లీ, లక్నో, కోటా, చండీగఢ్) సోదాలు నిర్వహించామని దర్యాప్తు సంస్థ పేర్కొంది. సీబీఐ ఇంతకుముందు రామకృష్ణను, గ్రూపు ఆపరేటింగ్ అధికారి ఆనంద్ సుబ్రమణియన్‌నూ అరెస్టు చేసింది. వీరు ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటికే పాండే వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. ఈయన ముంబై పోలీసు కమిషనర్‌గా జూన్ 30న పదవీ విరమణ పొందారు. కాగా, పాండే 2001 మార్చిలో ఐసాక్ సెక్యూరిటీని స్థాపించగా ఆ కంపెనీ బాధ్యతలను 2006 మేలో ఆయన తల్లి, కుమారుడు తీసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఐసాక్ సెక్యూరిటీస్ కంపెనీని ఉద్యోగులపై అక్రమంగా ఎలక్ట్రానిక్ నిఘా కోసం ఎన్ఎస్‌సీ మాజీ ఎండీలు వినియోగించారని సీబీఐ వెల్లడించింది.

## మహారాష్ట్ర కాంగ్రెస్‌పై రాహుల్ ఆగ్రహం

**ముంబై:** మహారాష్ట్రలో కాంగ్రెస్ పరిణామాలపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆగ్రహంతో ఉన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి తెలుసుకునేందుకు ఓ పరిశీలకుడిని నియమించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నది. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే సోనియాగాంధీతో సమావేశమైన తర్వాత పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో మహావికాస్ అఘాడీ ప్రభుత్వం పడిపోయిన తర్వాత పటోలే సోనియాను కలిశారు. ఈ భేటీలో రాహుల్‌గాంధీ, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం నానా పటోలే ట్వీట్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి, దళిత నేత చంద్రకాంత్ హండోరే ఓటమిపై అధిష్ఠానం అసంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. ఆయన ఓటమికి కారణమైన నేతలు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. చంద్రకాంత్ పాటిల్ ఓటమిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హెచ్‌కే పాటిల్‌ను మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్ ఇంతకుముందు అడిగారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు అనుమానాలున్నాయి. ఈ వ్యవహారంపై మాజీమంత్రి ఆసీం ఖాన్.. రాహుల్ గాంధీని కలిసి వివరించారు. పార్టీలో ఈ పరిణామాలపై రాహుల్ తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు.

మరోవైపు, సీఎం ఏక్‌నాథ్ షిండే అసెంబ్లీలో విశ్వాస పరీక్ష ఎదుర్కొన్న రోజు 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు గైర్హాజరు కావడంపై ఏఐసీసీ ఆగ్రహంతో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ విప్ జారీ చేసినా వీరంతా రాకపోవడంపై అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ రోజు సభకు హాజరుకాని వారిలో మాజీ సీఎం అశోక్ చవాన్, మాజీమంత్రి విజయ్ వడెట్టీవార్ వంటి ముఖ్య నేతలు ఉన్నారు. ముంబైలో ఉండి విశ్వాస పరీక్ష జరిగే కీలక సమయంలో వారు సభకు రాకపోవడం తీవ్రమైన విషయమని పార్టీ సీనియర్ నేత ఒకరు అన్నారు. ఉద్ధవ్ ఠాక్రే చివరి క్యాబినెట్ సమావేశంలో ఔరంగాబాద్, ఒస్మానాబాద్ జిల్లాల పేర్లు మార్చాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు కాంగ్రెస్ మంత్రులు అభ్యంతరం చెప్పకపోవడంపైనా అధిష్ఠానం కోపంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మహావికాస్ అఘాడీ(శివసేన-కాంగ్రెస్-ఎన్‌సీపీ) ప్రభుత్వం కూలిపోయిన తర్వాత నానా పటోలే సోనియాను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎం షిండే తిరుగుబాటుతో శివసేనలో చీలిక ఏర్పడి ఉద్ధవ్ ఠాక్రే వర్గం బలహీనపడింది. ఈ నేపథ్యంలో 2014 ముందు నుంచి మిత్రపక్షంగా ఉన్న ఎన్సీపీతోనే ముందుకు సాగాలనే ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది.

## దేశంలో తొలి కేబుల్-స్టేయిడ్ రైల్వే వంతెన

**న్యూదిల్లీ:** భారత దేశపు తొలి కేబుల్-స్టేయిడ్ రైల్వే వంతెన డిసెంబరు నాటికి సిద్ధం కాబోతోంది. జమ్ముకశ్మీరులో నిర్మితమవుతున్న ఈ అంజిఖాద్ వంతెన ఓ ఇంజినీరింగ్ అద్భుతం. దీనిని కాట్రా-రియాసిలను కలుపుతూ రియాసీ జిల్లాలోని అంజి నదిపై నిర్మిస్తున్నారు. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు అనుసంధానంలో భాగంగా ఈ నిర్మాణం జరుగుతోంది. ఈ రైల్ లింక్ హిమాలయాల గుండా అత్యంత ఎత్తయిన ప్రాంతంలో నిర్మితమవుతోంది. జమ్ముకశ్మీర్‌లో నిర్మాణంలో ఉన్న కేబుల్-స్టేయిడ్ రైల్వే వంతెన ప్రస్తుత స్థితిని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అంజిఖాద్ వంతెన కశ్మీరును అనుసంధానం చేస్తుందని చెప్పారు. ఇది తొలి కేబుల్-స్టేయిడ్ రైల్ బ్రిడ్జి అని, భవిష్యత్తు కోసం సిద్ధమవుతోందని పేర్కొన్నారు.

ఈ వంతెన పొడవు 473.25 మీటర్లు, నది గర్భం నుంచి 331 మీటర్ల ఎత్తులో, భారీ తుపానులను తట్టుకునే విధంగా దీనిని నిర్మిస్తున్నారు. దీనికి 96 కేబుల్స్ ఊతంగా నిలుస్తాయి. నిలువు ఏటవాలుపై సింగిల్ పైలాన్‌ను మాత్రమే నిర్మించడం ఇక్కడ సాధ్యమవుతుంది. చీనాబ్ నదిపై నిర్మించిన వంతెన తరహాలో ఇక్కడ సాధ్యం కాదు. విశిష్టమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలతో దీనిని నిర్మిస్తున్నారు.

# విమానయాన సంస్థలపై సమగ్ర సమీక్ష చేయండి

- ప్రయాణికుల భద్రతపై రాజీపడొద్దు
- కేంద్ర మంత్రి సింధియాకు సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం లేఖ

**న్యూదిల్లీ:** విమానయాన సంస్థల 'దయనీయ భద్రతా పరిస్థితులు' పై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎంపీ వినయ్ విశ్వం శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని వారాలుగా నమోదవుతున్న అనేక సంఘటనల నేపథ్యంలో విమానయాన భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకి ఆయన లేఖ రాశారు. గత 18 రోజులుగా ఎనిమిది సాంకేతిక లోపాలను చవిచూసిన స్పైస్‌జెట్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. స్పైస్‌జెట్ మాదిరిగానే ఇండిగో, విస్తారా కూడా మంగళవారం సాంకేతిక లోపానికి గురయ్యాయి. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా దేశవ్యాప్తంగా విమానయాన సంస్థలపై సమగ్ర సమీక్ష జరిగేలా చూడాలని, వినయ్ విశ్వం కేంద్ర మంత్రిని కోరారు. ప్రస్తుతం దేశంలో విమానయాన సంస్థలు పనిచేస్తున్న దయనీయ, భయంకర భద్రతా పరిస్థితులకు సంబంధించి ఈ లేఖ రాశాను' అని వినయ్ విశ్వం వివరించారు. గత కొన్ని నెలలుగా అనేక భద్రతా సంఘటనలు, అత్యవసర ల్యాండింగ్‌లు



జరిగాయని వామపక్ష నాయకుడు పేర్కొన్నారు. వివిధ విమానయాన సంస్థల్లో సుమారు 21 మిడ్-ఎయిర్ సేఫ్టీ (గాలిలో ఉండగా భద్రతా లోపాలు) సంఘటనలు జరిగాయి. వాటిలో 10 గత నెలలోనే జరిగాయి' అని వివరించారు. 'దీంతో పాటు అనేక విమానయాన సంస్థలు ఎయిర్ కండిషనింగ్ పనిచేయకపోవడం వంటి లోపాలను ఎదుర్కొన్నాయి. ఇది ప్రయాణీకులను ఉక్కిరిబిక్కిరి చేసేలా ఆరోగ్యపరమైన ఇబ్బందులకు దారితీసింది. ఇటువంటి విచారకరమైన పరిస్థితి క్షమించరానిది. విమాన ప్రయాణానికి సంబంధించి ఇప్పటికే భయపడుతున్న ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది' అని తెలిపారు. ఈ సమస్యలు 'జనాభాలో 4 శాతం మంది మాత్రమే విమాన ప్రయాణాన్ని ఉపయోగిస్తున్నారనే విషయాన్ని, విమాన టికెట్ల తలసరి వినియోగం విషయంలో కొన్ని పేద ఆఫ్రికా దేశాలతో పాటు భారతదేశ స్థానం ఉందన్న విషయాన్ని పూర్తిగా గుర్తు చేస్తుంది' అని ఆయన విమర్శించారు. 'పెరుగుతున్న విమాన ఇంధన ధరలతో విమానయాన సంస్థలపై భారం పెరుగుతోంది. ఖర్చు తగ్గించే చర్యగా భద్రతా విధానాల రాజీ గురించి మన మనస్సులో మరింత సందేహాన్ని కలిగిస్తుంది' అని సీపీఐ నేత పేర్కొన్నారు. అయితే, ప్రయాణీకుల భద్రతకు సంబంధించి దీనిని సాకుగా పరిగణించలేమని ఆయన నొక్కి చెప్పారు. 'పైన పేర్కొన్న విషయాల దృష్ట్యా, దేశవ్యాప్తంగా ఉన్న విమానయాన సంస్థల సమగ్ర సమీక్ష, మదింపు ఉండేలా చూడాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను. ప్రయాణీకుల భద్రత, శ్రేయస్సు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదు' అని ఎంపీ వినయ్ విశ్వం స్పష్టం చేశారు.

## నవరత్నాలపై నవ సందేహాలు

### ప్రశ్నలు సంధించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ఘనంగా అమలు చేశామని చెప్పుకొంటూ ప్రజలను మభ్యపెడుతున్న వైసీపీ నేతలకు జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రశ్నలు సంధించారు. వైసీపీ ప్రభుత్వం చెప్పే నవరత్నాల అమలు తీరుపై 'నవ సందేహాలు' లేవనెత్తారు. ఆ మేరకు ఆయన శుక్రవారం ఇందుకు సంబంధించిన ప్రశ్నలతో ట్వీట్ ద్వారా పోస్టర్ విడుదల చేశారు. రైతు భరోసా 64 లక్షల మందికి మేలు అని చెప్పి... 50 లక్షల మందికే భరోసా ఇవ్వడం నిజం కాదా? మూడేళ్లలో 3 వేల మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకొంటే కేవలం 700 మందికే ఆర్థిక సాయాన్ని పరిమితం చేయలేదా? అమ్మఒడి 43 లక్షల మందికి మాత్రమే ఇచ్చి.. 83 లక్షల మందికి ఇచ్చామని ఎందుకు అబద్ధపు ప్రచారం చేస్తున్నారు? పెన్షనర్ల జాబితాను కుదించి 5 లక్షల మందిని తొలగించిన మాట వాస్తవం కాదా? సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తానని చెప్పి మద్యం ఆదాయం 2018-19లో రూ.14 వేల కోట్లు... 2021-22లో రూ.22 వేల కోట్లు ఇదేనా మద్య నిషేధం? ఈ ఆదాయం చూపించే రూ.8 వేల కోట్లు బాండ్లు అమ్మలేదా? పోలవరం ప్రాజెక్టును 'యుద్ధ ప్రాతిపదిక'న ఎప్పుడు పూర్తి చేస్తారో చెబుతారా? ఆరోగ్యశ్రీ పథకం నుంచి ఆసుపత్రులు ఎందుకు పక్కకు తప్పుకొంటున్నాయి? సీఎంఆర్ఎఫ్ నుంచి వైద్యం ఖర్చులు ఎందుకు చెల్లించడం లేదు? రీయింబర్స్‌మెంట్ చేయకపోవడం వల్లే విద్యార్థులకు హాల్ టికెట్లు ఆపేస్తున్న మాట నిజం కాదా? పీజీ విద్యార్థులకు ఫీజు చెల్లింపులు ఎందుకు నిలిపివేశారు? చెరువుల్లో, గుట్టల్లో స్థలాలు ఇచ్చిన మాట నిజమే కదా? ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఎందుకు మంజూరు చేయలేదు? పొదుపు సంఘాల సంఖ్యను ఏటేటా లక్షల కొద్దీ ఎందుకు తగ్గిస్తున్నారు? అభయ హస్తం నిధులు రూ.2 వేల కోట్లు ఎటుపోయాయి? వీటిపై సమాధానం చెప్పాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు.

### వత్తుల పేరుతో

## రూ.20 కోట్ల దోపిడీ

**విశాలాంధ్ర- మేడిపల్లి:** మనుషుల అవసరాలు.. అమాయకుల నమ్మకాలు.. సామాన్యుల బలహీనతలే ఆసరాగా జరుగుతున్న మోసాలెన్నో! గుప్త నిధులంటూ కొందరు.. సులభంగా డబ్బు సంపాదన పేరుతో ఇంకొందరు.. ఉద్యోగాలిప్పిస్తామని ఒకరు.. డబ్బు రెట్టింపు చేస్తామంటూ మరొకరు.. కరక్కాయలు పొడి చేసి ఇస్తే బోలెడు సంపాదన అంటూ మరికొందరు.. ఇలా నమ్మకమే పెట్టుబడిగా మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. నిరక్షరాస్యులో, గ్రామీణులో కాదు.. ఉద్యోగులు, ఉన్నత విద్యావంతులు కూడా ఇలాంటి మోసాలకు బలవుతుండటమే విశేషం. తాజాగా హైదరాబాద్ బోడుప్పల్‌లో మరో భారీ మోసం బయటపడింది. వత్తుల తయారీ పేరిట ఏబీజీ అనే సంస్థ పెద్దఎత్తున డిపాజిట్లు వసూలు చేసి నిట్టనిలువునా ముంచేసింది. వత్తుల తయారీకి యంత్రాలు, దూది తామే ఇస్తామని నమ్మబలికిన సంస్థ.. ఒక్కో వ్యక్తి నుంచి రూ.1.70 లక్షలు డిపాజిట్ సేకరించింది. కిలో దూది రూ.300 చెల్లించి తీసుకుని వత్తులు తయారు చేసి ఇస్తే, రూ.600 చెల్లిస్తామంటూ బాధితులతో ఒప్పందం చేసుకుంది. అలాగే ఆరు నెలల తర్వాత చెల్లించిన డిపాజిట్ డబ్బులు మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తామంటూ ప్రచారం చేసుకుంది. దీంతో అనేక మంది నిర్వాహకుల మాటలు నమ్మి పెద్దఎత్తున డిపాజిట్లు చెల్లించారు. రెండు నెలల తర్వాత బోర్డు తిప్పేయడంతో ఏబీజీ కంపెనీ యజమాని బాలస్వామి గౌడ్‌పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 600 మంది నుంచి డిపాజిట్లు సేకరించినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. రూ.20 కోట్ల మేర నిర్వాహకులు వసూలు చేసినట్లు అంచనా. ఈ మేరకు ఏబీజీ సంస్థపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### ఏపీ రైతు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా

## జనార్ధన్, మునిరత్నం నాయుడు

**విశాలాంధ్ర-చిత్తూరు:** ఏపీ రైతు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా టి.జనార్ధన్, కె.మునిరత్నం నాయుడు ఎన్నికయ్యారు. గురువారం చిత్తూరు మార్కెట్ యార్డులో జిల్లా రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జనార్ధన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరయిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.కాటమయ్య మాట్లాడుతూ రైతులను విస్మరిస్తే దేశ ఆహార భద్రతకు ముప్పు వస్తుందని అన్నారు. రైతులు ఇప్పటికే గోదావరి జిల్లాల్లో గిట్టుబాటు లేక పంట విరామం వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. పంట విరామం అంటే ఆహార పదార్థాల కొరత ఏర్పడి ధరలు అమాంతంగా పెరిగిపోతాయన్నారు. రైతాంగ పోరాట ఫలితంగా నల్ల చట్టాలు రద్దు చేయించుకొన్నామని, నేడు విద్యుత్ మీటర్ల ప్రతిపాదనకు వెనక్కు తగ్గుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌ను పునరుద్ధరణకు పూనుకోవడం హర్షణీయం తెలిపారు. రైతు సంఘం నేతలు ఎ.రామానాయుడు, నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో చక్కెర కర్మాగారాలు, విజయ డెయిరీ పునః ప్రారంభం చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని, లేకపోతే రైతు వ్యతిరేక చర్యలపై ఉద్యమాలకు సన్నద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ మాజీ డైరెక్టర్ పద్మనాభం నాయుడు, ఎస్.నాగరాజన్ తదితరులు ప్రసంగించారు.







# వైఎస్ మెమోరియల్ ఏర్పాటు చేయాలి

- వైఎస్ అభిమానులు ముందుకు రావాలి
- స్థలాల కేటాయింపు రద్దు దారుణం: వైఎస్ షర్మిల

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో వైఎస్ రాజశేఖరరెడ్డికి ఒక మెమోరియల్ ఏర్పాటు చేయాలని, దీనిపై వైఎస్ భిక్షతో రాజకీయ నేతలుగా ఎదిగిన వివిధ పార్టీల్లో ఉన్న వారంతా ముందుకు రావాలని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో వైఎస్సార్‌టీపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆమె ఎగురవేశారు. తెలంగాణలో రాజశేఖరెడ్డి మెమోరియల్ ఏర్పాటులో సీఎం కేసీఆర్ తీవ్ర అవమానించారన్నారు. ఆయన మెమోరియల్‌కు కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకోవడం దురదృష్టకరమని చెప్పారు. వైఎస్ గౌరవార్థం హైదరాబాద్‌లో స్థలం కేటాయించాలన్నారు. తెలంగాణలో వైఎస్ పేరు లేకుండా చూడాలనేదే, కేసీఆర్ లక్ష్యమన్నారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ వైఎస్‌ను స్మరించుకోవడానికి హైదరాబాద్‌లో సెంటు

భూమి కూడా లేదా? అని ప్రశ్నించారు. వైఎస్ బిడ్డగా అడుగుతున్నానని చెప్పారు. నాటి వైఎస్ హయాంలో మంత్రివర్గ ఉప సంఘంలో ఉన్న వారంతా, నేడు టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారన్నారు. ఇవాళ వరకు రాజశేఖరెడ్డికి స్మరించేందుకు చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. వాళ్లందరికీ వైఎస్‌తోనే రాజకీయ భిక్ష వచ్చిందన్నారు. ప్రస్తుత టీఆర్ఎస్ భవన్‌ను ఇచ్చింది, నాడు వైఎస్ కాదా? అని ప్రశ్నించారు. రాజశేఖరరెడ్డి మెమోరియల్ కోసం పోరాడాల్సిన అవసరం ప్రజలపైనా ఉందని, మిగతా పార్టీల్లోనూ వైఎస్ ద్వారా రాజకీయంగా ఎదిగిన నేతలంతా ముందుకు రావాలని కోరారు. వైఎస్ సంక్షేమ పాలన ప్రతి గడపనూ, ప్రతి గుండెనూ తాకిందని వివరించారు. వైఎస్ సువర్ణ పాలనను ప్రజలు గుర్తించారన్నారు. వైఎస్ సేవలను ప్రభుత్వాలు మాత్రం గుర్తించలేదని దుయ్యబట్టారు. హైదరాబాద్ కేంద్రంగా వైఎస్సార్ సువర్ణపాలన అందించారన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రభుత్వాలు వైఎస్ సేవలను విస్మరించాయని మండిపడ్డారు. నాడు ముఖ్యమంత్రిగా వైఎస్‌కు కేటాయించిన స్థలాలను, టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రద్దు చేయడాన్ని తప్పుపట్టారు. సరిగ్గా గతేడాది ఈనెల 8న వైఎస్సార్ టీపీని షర్మిల స్థాపించారని వివరించారు. పార్టీ స్థాపించిన తొలి రోజు నుంచి షర్మిల అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారన్నారు.

# ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు ఈడీ షాక్

- రూ.51.72కోట్ల జరిమానా
- ఆకార్ పటేల్‌కు రూ.10కోట్లు ఫైన్

**న్యూదిల్లీ:** అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇండియా ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఐఐపీఎల్)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. రూ.51.72 కోట్ల జరిమానా విధించింది. 2019లో ఫెమా నిబంధనలను అతిక్రమించిన వ్యవహారంలో ఈ సంస్థ మాజీ చైర్మన్ ఆకార్ పటేల్‌కు కూడా రూ.10కోట్ల జరిమానా విధించింది. భారతీయ సంస్థల నుంచి భారీగా విదేశీ నిధులను ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, యునైటెడ్ కింగ్‌డమ్ పొందినట్లు సమాచారం ఉండటంతో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ద్వారా విదేశీ తోడ్పాటు (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద నమోదు అయి లేకపోవడాన్ని పేర్కొంది. హోం వ్యవహారాల శాఖ (ఎంహెచ్‌ఏ) ద్వారా ఎఫ్‌సీఆర్‌ఏ కింద ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా ఫౌండేషన్ ట్రస్ట్ (ఏఐఐఎఫ్‌టీ)కి, ఇతర ట్రస్టులకు



అనుమతులు నిరాకరించినప్పటికీ భారత్‌లో ఎన్జీవో కార్యకలాపాలను విస్తరించే ప్రయత్నం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా ప్రస్తుతం జరిమానా విధించారు. మొత్తం 70కి పైగా దేశాలలో పనిచేస్తున్న ఆమ్నెస్టీ 2016 లో రష్యాలో, తాజాగా భారత్‌లో తమ కార్యకలాపాలను నిలిపేసింది. 2009లోనూ తన కార్యకలాపాలను భారత్‌లో తాత్కాలికంగా నిలిపివేసింది. 2019 చివర్లో ఆమ్నెస్టీ కార్యాలయాలపై సీబీఐ సోదాలు నిర్వహించింది. విదేశాల నుంచి పెద్ద ఎత్తున అక్రమంగా విరాళాలను ఫెమా చట్టాన్ని ఉల్లంఘించి తీసుకొచ్చారని ఈడీ నిర్ధారించింది. గతంలో విధించిన ఈ జరిమానాకు అడ్జుకేటింగ్ అథారిటీ ఆమోదం తెలిపింది.

## షిండేపై సుప్రీంలో ఉద్ధవ్ వర్గం పిటిషన్

**ముంబై:** మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్ధవ్ ఠాక్రే శివసేన వర్గం సుప్రీంకోర్టులో మరో పిటీషన్ దాఖలు చేసింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా షిండేను గవర్నర్ భగత్‌సింగ్ కోష్యారి ఆహ్వానించడాన్ని పిటీషన్ ద్వారా సవాల్ చేసింది. 16 మంది రెబల్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ విషయంపై ఎటూ తేలకుండానే అసెంబ్లీలో బల పరీక్ష నిర్వహించారని, స్పీకర్ ఎన్నిక ఓటింగ్‌లోనూ వారంతా పాల్గొన్నారని కోర్టుకు తెలిపింది. ఉద్ధవ్ ఠాక్రే వర్గం ప్రతినిధి సుభాశ్ దేశాయ్ ఈ పిటీషన్ దాఖలు చేశారు. తిరుగుబాటు ఎమ్మెల్యేల అనర్హతపై తీర్పు చెప్పాలని ఠాక్రే వర్గం కోరింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.